



తెలుగు దినపత్రిక

# వార్త నిర్భయం

సామాన్యుని చేతిలో సామాజిక అస్త్రం!

www.vaarhtanirbhayam.com

ఎడిటర్ కాడేపాగు అశోక్

ఆంధ్రప్రదేశ్ & తెలంగాణ

తెలంగాణ - ఆంధ్ర ప్రదేశ్ సంపుటి : 01 సంచిక : 109 చీఫ్ ఎడిటర్: కాడేపాగు అశోక్ పేజిలు : 04, వెల రూ. 4రూ/ సోమవారం- 16 - మార్చి - 2026

Published From Kurnool : Circulated at 'Kurnool Srikakulam,VishakaPatanam,Vijayanagaram, East Godavari, West Godavari, Krishna, Guntur, Prakasam, Nellore, Chittoor,, Kadapa, Anantapuram,




## వ్యవస్థాపకుడు కాన్షీరామ్‌కు భారతరత్న ఇవ్వండి



- బహుజన్ సమాజ్ పార్టీ వ్యవస్థాపకుడు కాన్షీరామ్‌కు భారతరత్న ఇవ్వాలన్న కాంగ్రెస్ నేత రాహుల్

ఢిల్లీ : ప్రధాని నరేంద్ర మోదీకి లోక్‌సభలో విపక్షనేత, కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ లేఖ రాశారు. అందులో బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ) వ్యవస్థాపకుడు కాన్షీరామ్‌కు భారతరత్న ఇవ్వాలని కోరారు. ఈ పురస్కారం కాన్షీరామ్‌ను ఆరాధిస్తున్న లక్షలాది మంది ప్రజల ఆకాంక్షలను గౌరవిస్తుందని పేర్కొన్నారు. కాన్షీరామ్ భారత రాజకీయాల స్వభావాన్ని మార్చారని కొనియాడారు. తన ఉద్యమాల ద్వారా బహుజనులు, పేదలలో రాజకీయ అవగాహన పెంచారని పేర్కొన్నారు. ఈ మేరకు మోదీకి రాసిన లేఖలో రాహుల్ పేర్కొన్నారు. మరోవైపు,

## రాహుల్ గాంధీ భారత్‌ను, ప్రజాస్వామ్యాన్ని కించపరుస్తున్నారు

- బీజేపీని, ప్రధానిని వ్యతిరేకించే క్రమంలో, దేశాన్నీ రాహుల్ వ్యతిరేకిస్తున్నారు
- దేశాన్ని అప్రతిష్టపాలు చేసేందుకే ఏఐ సదస్సు వద్ద కాంగ్రెస్ నిరసన
- ఏఐ సదస్సు వ్యక్తిగత రాజకీయాలు చేసుకునే ప్రదేశమా – అమిత్ షా విమర్శలు



ఢిల్లీ : కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ భారతదేశాన్ని, దాని ప్రజాస్వామ్యాన్ని కించపరిచేలా వ్యవహరిస్తున్నారని కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ఆరోపించారు. ఇటీవలె ఢిల్లీలో జరిగిన ఏఐ ఇంపాక్ట్ సదస్సు వద్ద కాంగ్రెస్ యువజన విభాగం నేతలు చొక్కాలు లేకుండా నిరసనకు దిగిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. అది వ్యక్తిగత రాజకీయాలు చేసుకునే ప్రదేశం కాదని హితవు పలికారు. విపక్షాలకు నిరసన తెలిపే హక్కు తప్పకుండా ఉంటుందని, కానీ ఏఐ సదస్సులాంటి చోట నిరసన తెలపడం సరికాదన్నారు. బీజేపీ, ప్రధానమంత్రి నరేంద్రమోదీలను వ్యతిరేకించే క్రమంలో, చివరకు భారతదేశాన్ని కూడా వ్యతిరేకించడాన్ని రాహుల్ గాంధీ మొదలుపెట్టారని అమిత్‌షా విమర్శించారు. ఆదివారం అసోంలోని గువహటిలో మిగతా..2లో

## ఎలక్షన్ నోటిఫికేషన్ కు ముందు మమత కీలక ప్రకటన
## పురోహితులు, ముఅజ్జిన్‌ల గౌరవ వేతనం పెంపు

- హిందూ పురోహితులు, ముస్లిం ముఅజ్జిన్‌లకు గుడ్ న్యూస్
- రూ.500 చొప్పున గౌరవ వేతనాన్ని పెంచిన
- ఇక నుంచి వారికి ప్రతినెలా రూ.2వేలు
- ఈనెల నుంచే ఉద్యోగులు, పెన్షనర్లకు డీఏ బకాయిలు



ఢిల్లీ : బంగాల్ ఎన్నికల షెడ్యూల్‌పై కేంద్ర ఎన్నికల సంఘం ఆదివారం ప్రకటన చేయడానికి కొన్నిగంటల ముందు సీఎం మమతా బెనర్జీ కీలక ప్రకటన చేశారు. హిందూ పురోహితులు, ముస్లిం ముఅజ్జిన్‌ల నెలవారీ గౌరవ వేతనాన్ని మరో రూ.500 చొప్పున పెంచుతున్నట్లు ఆమె వెల్లడించారు. దీని ప్రకారం ఇకపై బంగాల్‌లోని పురోహితులు, ముఅజ్జిన్‌లకు ప్రభుత్వం నుంచి ప్రతినెలా రూ.2వేల గౌరవ వేతనం లభించనుంది. ఈమేరకు వివరాలతో ఎక్స్ వేదికగా సీఎం మమతా బెనర్జీ ట్వీట్ చేశారు. పురోహితులు, ముఅజ్జిన్‌ల గౌరవ వేతనాలను పెంచే ఆదేశాన్ని ఇచ్చినందుకు తనకు సంతోషంగా ఉందని ఆమె వెల్లడించారు. ఈ సమాజపు ఆధ్యాత్మిక, సామాజిక జీవితాల కోసం పురోహితులు, ముఅజ్జిన్‌లు ఎన్నో సేవలు అందిస్తున్నారని మిగతా..2లో

## మూసీ బ్యూటిఫికేషన్ పేరిట లూటిఫికేషన్



- పీఆర్సీ రిపోర్టు వస్తే ఉద్యోగులకు జీతాలు పెంచాల్సి వస్తుందన్న కారణంతో దానిని పొడిగిస్తున్నారని ఆరోపించారు.
- పదవీ విరమణ ప్రయోజనాలు రాక పదుల సంఖ్యలో విశ్రాంత ఉద్యోగులు ప్రాణాలు కోల్పోతున్నారని ఆక్షేపించారు.

సిద్దిపేట్: మూసీ బ్యూటిఫికేషన్ పేరిట లూటిఫికేషన్ చేసి సీఎం రేవంత్‌రెడ్డి రూ.కోట్లు కొల్లగొడుతున్నారని మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. పీఆర్సీ రిపోర్టు వస్తే ఉద్యోగులకు జీతాలు పెంచాల్సి వస్తుందన్న కారణంతో దానిని పొడిగిస్తున్నారని ఆరోపించారు. ఉపాధ్యాయులకు వేతనాలు ఎక్కువగా ఉన్నాయని, వాటిని తగ్గించాలని విద్యాకమిషన్ రిపోర్టులో ఉందన్నారు.

## డ్రగ్స్ టెస్టుకు నేను సిద్ధం...
# కాంగ్రెస్ సవాల్ స్వీకరించిన కేటీఆర్

- డ్రగ్స్ వాడేవారు ఎవరైనా, ఏ పార్టీకి చెందినవారైనా చట్ట ప్రకారం కఠినంగా శిక్షించాలని స్పష్టం చేశారు.
- మొయినాబాద్ ఫామ్‌హౌస్‌లో జరిగిన డ్రగ్స్ పార్టీ వ్యవహారంలో కాంగ్రెస్ నేతలు విసిరిన సవాల్‌ను ఆయన స్వీకరించారు.
- డ్రగ్స్ కేసును అడ్డం పెట్టుకుని బీఆర్ఎస్ పార్టీపై బురద చల్లడం నీచ రాజకీయాలకు నిదర్శనమని మండిపడ్డారు.




హైదరాబాద్: బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తాను డ్రగ్స్ టెస్టుకు సిద్ధంగా ఉన్నానని ఆదివారం ప్రకటించారు. మొయినాబాద్ ఫామ్‌హౌస్‌లో జరిగిన డ్రగ్స్ పార్టీ వ్యవహారంలో కాంగ్రెస్ నేతలు విసిరిన సవాల్‌ను ఆయన స్వీకరించారు. డ్రగ్స్ వాడేవారు ఎవరైనా, ఏ పార్టీకి చెందినవారైనా చట్ట ప్రకారం కఠినంగా శిక్షించాలని స్పష్టం చేశారు. "ఏ టెస్టుకైనా నేను సిద్ధమని ఇప్పటికే చాలాసార్లు చెప్పాను. అన్ని రాజకీయ పార్టీలకు చెందిన ప్రజాప్రతినిధులు ఈ పరీక్ష చేయించుకోవాలన్న మహేశ్ కుమార్ గౌడ్ సూచనను స్వాగతిస్తున్నాను. మిగతా..2లో

## నేను మీ సోదరుడిని మీ ఆశీర్వాదం కావాలి..
## ఇఫ్తార్ విందులో సీఎం రేవంత్ రెడ్డి

ఎల్బీ స్టేడియంలో జరిగిన ఇఫ్తార్ విందులో సీఎం రేవంత్ రెడ్డి పాల్గొన్నారు.

మైనార్టీల సంక్షేమం, 4 శాతం రిజర్వేషన్లపై ఆయన కీలక వ్యాఖ్యలు చేశారు.

హైదరాబాద్: తమ ప్రభుత్వం మైనార్టీలకు అధిక ప్రాధాన్యత ఇస్తోందని, రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసే ప్రతి సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమంలో మైనార్టీలకు సింహాభాగం ఇచ్చి అభివృద్ధి వైపు నడిపించే ప్రయత్నం చేస్తున్నామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి (=వఝుత్ష్ర =వసఎఎ) అన్నారు. ఇవాళ ఎల్బీ స్టేడియంలో రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో (×ట్ఖుతీ ౄఖుతీఎ) సీఎం పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఆయన.. రంజాన్ పవిత్ర మాసం సమాజంలో సఖ్యత, సోదర భావం పరిఢవిల్లాలి అని ఆకాంక్షించారు. ఈ ప్రభుత్వం మీది, నేను మీ సోదరుడిని మనమంతా కలిసి హైదరాబాద్, తెలంగాణ రాష్ట్రాన్ని ముందుకు తీసుకు వెళ్దాం




అని పిలుపునిచ్చారు. మీ అందరి ఆశీర్వాదం ఈ ప్రభుత్వానికి అవసరం అన్నారు.

డ్రగ్స్ కేసులో ప్రజాప్రతినిధులు.. తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్న ప్రజలు

### మీకు అండగా ఉంటాం:

ఇవాళ వందలాది మంది మైనార్టీ యువతీ యువకులకు విద్యా, ఉద్యోగావకాశాలు లభిస్తున్నాయంటే దానికి కాంగ్రెస్ ప్రభుత్వం మైనారిటీలకు తీసుకువచ్చిన

## ఎంపీ పుట్టా మహేశ్ యాదవ్ డ్రగ్స్ వ్యవహారం.. టీడీపీ సంచలన నిర్ణయం



ఏలూరు ఎంపీ పుట్టా మహేశ్ యాదవ్‌కు తెలుగుదేశం పార్టీ అధిష్టానం బిగ్ షాక్ ఇచ్చింది.

మొయినాబాద్ డ్రగ్స్ కేసులో ఆయన నిందితుడిగా ఉన్న నేపథ్యంలో సీరియస్ అయింది...

అమరావతి : ఏలూరు ఎంపీ పుట్టా మహేశ్ యాదవ్ కు తెలుగుదేశం పార్టీ అధిష్టానం బిగ్ షాక్ ఇచ్చింది. మొయినాబాద్ డ్రగ్స్ కేసు లో ఆయన నిందితుడిగా ఉన్న నేపథ్యంలో సీరియస్ అయింది. రాజకీయంగా విమర్శలు చెలరేగడంతో ఆ పార్టీ సంచలన నిర్ణయం తీసుకుంది. మిగతా..2లో

## నెతన్యాహును వెంటాడి చంపుతాం




ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు ఆచూకీపై వదంతులు వ్యాపిస్తున్న వేళ ఇరాన్ రెవల్యూషనరీ గార్డ్స్ ఘాటు హెచ్చరిక చేసింది.

ఆయన బతికి ఉంటే వెంటాడి మరీ అంతమొందిస్తామని సోషల్ మీడియాలో ప్రకటించింది.

ఢిల్లీ: ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు గత కొంతకాలంగా బహిరంగ కార్యక్రమాల్లో కనిపించకపోవడంతో రకరకాల వదంతులు బయలుదేరాయి. ఈ నేపథ్యంలో ఆదివారం ఇరానియన్ రెవల్యూషనరీ గార్డ్స్ ఘాటు హెచ్చరిక చేసింది. మిగతా..2లో

## డ్రగ్స్ పార్టీలో పట్టుబడిన ఏలూరు ఎంపీ...
## టీడీపీపై షర్మిల ఫైర్



- ఏలూరు టీడీపీ ఎంపీ పుట్టా మహేశ్ కుమార్ యాదవ్ వ్యవహారంపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.
- "ఢిల్లీలో పార్లమెంట్ సమావేశాలు జరుగుతుంటే, ఇక్కడ ఎంపీ కొకైన్‌తో విందు, చిందులు చేయడం దారుణం.
- ఓట్లు వేసి గెలిపించిన ఏలూరు ప్రజలకు ఏం సమాధానం చెబుతారని ఆమె ప్రశ్నించారు.

## ఏలూరు ఎంపీ పుట్టా మహేశ్‌పై చంద్రబాబు సీరియస్...
# నోటీసులు ఇవ్వాలని పల్లాకు ఆదేశం!

ఏలూరు టీడీపీ ఎంపీ పుట్టా మహేశ్ కుమార్ యాదవ్ పట్టుబడటంపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

డ్రగ్స్ వంటి తీవ్రమైన ఆరోపణలు ఎదుర్కొంటున్న వారు ఎవరైనా సరే, ఉపేక్షించే ప్రసక్తే లేదని



మొయినాబాద్ ఫామ్ హౌస్‌లో జరిగిన డ్రగ్స్ పార్టీ వ్యవహారంలో ఏలూరు టీడీపీ ఎంపీ పుట్టా మహేశ్ కుమార్ యాదవ్ పట్టుబడటంపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఆరోపణలను చాలా సీరియస్‌గా తీసుకున్న ఆయన, పార్టీ కార్యకలాపాలకు తక్షణమే దూరంగా ఉండాలని పుట్టా మహేశ్‌ను ఆదేశించారు. ఈ విషయంపై స్పందించిన చంద్రబాబు.. పుట్టా మహేశ్ నుంచి వివరణ కోరుతూ షోకాజ్ నోటీసులు జారీ చేయాలని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావుకు మిగతా..2లో

## డ్రగ్స్ పార్టీలో పట్టుబడిన పుట్టా మహేశ్‌కు ఎంపీగా ఉండే అర్హత లేదు



- రంగంలోకి దిగారని, డ్రగ్స్ మాఫియాను ఆయనే పెంచి పోషిస్తున్నారని ఆరోపించారు.
- కాకాణి మాట్లాడుతూ, "చంద్రబాబు బ్రాండ్ అంటేనే డ్రగ్స్ బ్రాండ్" అంటూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు.

ఢిల్లీ : డ్రగ్స్ పార్టీలో పట్టుబడిన ఏలూరు టీడీపీ ఎంపీ పుట్టా మహేశ్‌కు పదవిలో కొనసాగే నైతిక అర్హత లేదని వైసీపీ నేత, మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి తీవ్రస్థాయిలో విమర్శించారు.

మొదటి పేజి తరువాయి

## ఏలూరు ఎంపీ పుట్టా మహేశ్‌పై చంద్రబాబు సీరియస్...
# నోటీసులు ఇవ్వాలని పల్లాకు ఆదేశం!

స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. అలాగే, డ్రగ్స్ కేసులో పుట్టా పట్టుబడిన వ్యవహారంపై పూర్తిస్థాయి నివేదిక సమర్పించాలని కూడా పల్లాను ఆదేశించారు. వ్యక్తుల బలహీనతలు, వ్యక్తిగత తప్పిదాల వల్ల పార్టీ ప్రతిష్ఠకు భంగం కలిగించే చర్యలను ఎట్టిపరిస్థితుల్లోనూ సహించేది లేదని చంద్రబాబు తేల్చిచెప్పారు. డ్రగ్స్ వంటి తీవ్రమైన ఆరోపణలు ఎదుర్కొంటున్న వారు ఎవరైనా సరే, ఉపేక్షించే ప్రసక్తే లేదని పార్టీ జాతీయ అధ్యక్షుడి హోదాలో ఆయన ఉద్ఘాటించారు. ఈ ఘటనపై పార్టీపరంగా కఠిన చర్యలు ఉంటాయనే సంకేతాలను ఇచ్చారు.

## డ్రగ్స్ పార్టీలో పట్టుబడిన ఏలూరు ఎంపీ...
# టీడీపీపై షర్మిల ఫైర్

ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల, ఏలూరు టీడీపీ ఎంపీ పుట్టా మహేశ్ కుమార్ యాదవ్ వ్యవహారంపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. మొయినాబాద్ ఫామ్‌హౌస్‌లో జరిగిన డ్రగ్స్ పార్టీలో టీడీపీ ఎంపీ పట్టుబడటం సిగ్గుచేటని విమర్శించారు. అతడిపై తక్షణమే అనర్హత వేటు వేయాలని, తెలుగుదేశం పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని ఆమె డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా షర్మిల సోషల్ మీడియాలో స్పందిస్తూ... "ఢిల్లీలో పార్లమెంట్ సమావేశాలు జరుగుతుంటే, ఇక్కడ ఎంపీ కొకైన్‌తో విందు, చిందులు చేయడం దారుణం. రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉండి ఇంత బాధ్యతారహితంగా వ్యవహరిస్తారా డ్రగ్స్ టెస్టులో పాజిటివ్ వచ్చింది కదా, ఇప్పుడు చంద్రబాబు ఏం చర్యలు తీసుకుంటారు?" అని ప్రశ్నించారు. డ్రగ్స్ తీసుకుంటూ పట్టుబడిన ఎంపీ సమాజానికి ఏం సందేశం ఇస్తున్నారని, యువతను డ్రగ్స్ వాడమని ప్రోత్సహిస్తున్నారా అని షర్మిల నిలదీశారు. ఓట్లు వేసి గెలిపించిన ఏలూరు ప్రజలకు ఏం సమాధానం చెబుతారని ఆమె ప్రశ్నించారు. డ్రగ్స్‌పై నిజంగానే కూటమి ప్రభుత్వం ఉక్కుపాదం మోపాలనుకుంటే, ముందుగా తమ సొంత పార్టీ ఎంపీపై చర్యలు తీసుకుని ముఖ్యమంత్రి చంద్రబాబు తన చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని షర్మిల సవాల్ విసిరారు.ం

## డ్రగ్స్ పార్టీలో పట్టుబడిన పుట్టా మహేశ్‌కు
# ఎంపీగా ఉండే అర్హత లేదు

పుట్టా మహేశ్‌ను రక్షించడానికి స్వయంగా ముఖ్యమంత్రి చంద్రబాబే రంగంలోకి దిగారని, డ్రగ్స్ మాఫియాను ఆయనే పెంచి పోషిస్తున్నారని ఆరోపించారు. సామాన్యుడికి ఒక రూల్, ప్రజాప్రతినిధికి మరో రూల్ ఉండకూడదని ఆయన స్పష్టం చేశారు. హైదరాబాద్ శివారు మొయినాబాద్‌లోని బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్ రెడ్డికి చెందిన ఫామ్‌హౌస్‌లో జరిగిన వీకెండ్ పార్టీలో డ్రగ్స్ కలకలం సృష్టించిన సంగతి తెలిసిందే. ఈ పార్టీలో పుట్టా మహేశ్ డ్రగ్స్ తీసుకున్నట్లు ఈగిల్ ఫోర్స్ పోలీసులు అధికారికంగా ప్రకటించారు. ఈ ఘటన ఏపీ రాజకీయాల్లో పెద్ద దుమారం రేపింది. ఈ నేపథ్యంలో కాకాణి మాట్లాడుతూ, "చంద్రబాబు బ్రాండ్ అంటేనే డ్రగ్స్ బ్రాండ్" అంటూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఈ ఘటనతో వైసీపీ నేతలు టీడీపీని 'డ్రగ్స్ పార్టీ'గా అభివర్ణిస్తూ విమర్శలు గుప్పిస్తున్నారు. ప్రస్తుతం ఈ డ్రగ్స్ కేసుపై పోలీసుల విచారణ కొనసాగుతోంది. ఇదే ఫామ్‌హౌస్‌లో కాల్పులు జరిపిన వ్యక్తిని కూడా అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఈ వ్యవహారంలో ప్రభుత్వం పుట్టా మహేశ్‌పై ఎలాంటి చర్యలు తీసుకుంటుందనేది రాజకీయ వర్గాల్లో ఆసక్తికరంగా మారింది.

## డ్రగ్స్ టెస్టుకు నేను సిద్ధం...
# కాంగ్రెస్ సవాల్ స్వీకరించిన కేటీఆర్

మనమే ఉదాహరణగా నిలుద్దాం" అని కేటీఆర్ 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. సోమవారం నుంచి ప్రారంభమయ్యే అసెంబ్లీ సమావేశాల సందర్భంగా, కాంగ్రెస్ ఎమ్మెల్యేలతో పాటు కేటీఆర్, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలందరూ డ్రగ్స్ టెస్టుకు రావాలని టీపీసీసీ అధ్యక్షుడు బి. మహేశ్ కుమార్ గౌడ్ సవాల్ విసిరారు. శనివారం రాత్రి మొయినాబాద్‌లోని ఓ ఫామ్‌హౌస్‌పై పోలీసులు దాడి చేయగా, బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్ రెడ్డి సహా ఆరుగురు డ్రగ్స్ తీసుకున్నట్లు తేలిన నేపథ్యంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ పరిణామాలపై స్పందించిన కేటీఆర్.. డ్రగ్స్ కేసును అడ్డం పెట్టుకుని బీఆర్ఎస్ పార్టీపై బురద చల్లడం నీచ రాజకీయాలకు నిదర్శనమని మండిపడ్డారు. ప్రతీ డ్రగ్స్ కేసులోకి అనవసరంగా తన పేరును లాగితే చట్టపరమైన నోటీసులతో స్పందించాల్సి ఉంటుందని హెచ్చరించారు. హైదరాబాద్ శివారు మొయినాబాద్‌లోని ఫామ్‌హౌస్‌పై శనివారం రాత్రి ఈగిల్ బృందం దాడి చేయగా, టీడీపీ ఎంపీ పుట్టా మహేశ్ కుమార్, మాజీ ఎమ్మెల్యే రోహిత్ రెడ్డితో పాటు మొత్తం ఆరుగురికి డ్రగ్స్ పరీక్షల్లో పాజిటివ్‌గా నిర్ధారణ అయింది. పట్టుబడిన వారిని ఈగిల్ బృందం మొయినాబాద్ పోలీసులకు అప్పగించింది.

# మూసీ బ్యూటిఫికేషన్ పేరిట లూటిఫికేషన్

ఇది ముమ్మాటికీ రేవంత్ రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా తయారు చేసిన నివేదిక అని ఆరోపించారు. మూసీ సుందరీకరణకు రూ.1.50 లక్షల కోట్ల నిధులుంటాయిగానీ, విశ్రాంత ఉద్యోగులకు ఇచ్చేందుకు రూ.10 వేల కోట్లు లేవా? అని ప్రశ్నించారు. సిద్దిపేటలో రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విశ్రాంత ఉద్యోగులు ఆదివారం ఒక్కరోజు నిరాహరదీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా వారికి మద్దతుగా హరీశ్‌రావు మాట్లాడారు. పదవీ విరమణ ప్రయోజనాలు రాక పదుల సంఖ్యలో విశ్రాంత ఉద్యోగులు ప్రాణాలు కోల్పోతున్నారని ఆక్షేపించారు. ప్రభుత్వం వెంటనే స్పందించి వచ్చే బడ్జెట్‌లో బకాయిల కోసం రూ.10వేల కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు.

## నేను మీ సోదరుడిని మీ ఆశీర్వాదం కావాలి..
# ఇఫ్తార్ విందులో సీఎం రేవంత్ రెడ్డి

4 శాతం రిజర్వేషన్లే కారణం అని సీఎం అన్నారు. ఇంటిగ్రేటెడ్ హాస్టల్స్ ద్వారా ప్రభుత్వం సహకరిస్తోందన్నారు. ప్రపంచంలో యుద్ధ పరిస్థితులు చూస్తున్నాం. భారత్‌లోని మన మధ్య విభేదాలు సృష్టించాలని చూస్తారు. ఆ మాయలో మనం పడవద్దని అందరం కలిసి తెలంగాణను దేశంలోనే అభివృద్ధి పథం వైపు నడిపే ప్రయత్నం చేద్దామన్నారు. మైనార్టీల కోసం ఈ ప్రభుత్వం ఎంత వరకు అండగా ఉండాలో అంత వరకు అండగా ఉంటామన్నారు. మైనార్టీ నేత అజారుద్దీన్ ను మంత్రి వర్గంలోకి తీసుకున్నామని, మైనార్టీలకు 4 శాతం రిజర్వేషన్లు అమలు చేయడంలో కీలక పాత్ర పోషించిన షబ్బీర్ అలీనీ ప్రభుత్వ సలహాదారుగా, 8 మంది మైనార్టీలను వివిధ కార్పొరేషన్లకు చైర్మన్లను నియమించుకున్నామని క్రీడాకారులు సిరాజ్, నిఖత్ జరీన్ ను గౌరవించుకున్నామని చెప్పారు. ఈ ఇఫ్తార్ విందులో మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంఐఎం చీఫ్ అసదుద్దీన్ ఒవైసీ తదితరులు పాల్గొన్నారు.

## ఎంపీ పుట్టా మహేశ్ యాదవ్ డ్రగ్స్ వ్యవహారం..
# టీడీపీ సంచలన నిర్ణయం

డ్రగ్స్ కల్చర్‌పై ఉక్కుపాదం మోపుతున్న సమయంలో పూర్తి స్థాయిలో యాక్షన్ తీసుకోవాలని నిర్ణయించింది. ప్రస్తుతం పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంచాలని నిర్ణయించింది.ఈ మేరకు పుట్టా మహేశ్‌కు ఇంటిమేషన్ ఇచ్చింది. నోటీసులు ఇచ్చి వివరణ కోరాలని నిర్ణయించింది. చట్టపరంగా మరింత స్పష్టత వచ్చిన తర్వాత పార్టీకి సంబంధించి పూర్తి స్థాయిలో చర్యలు తీసుకోవాలని రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు నిర్ణయించినట్లు తెలుస్తోంది. ఎంపీ అయినా, ఎమ్మెల్యే అయినా సరే డ్రగ్స్ విషయంలో ఉపేక్షించమని ఆయన తెలిపినట్లు సమాచారం.

# నెతన్యాహును వెంటాడి చంపుతాం




నెతన్యాహు బతికి ఉన్నట్టే అయితే ఆయనను వెంటాడి మరీ అంతమొందిస్తామని హెచ్చరించింది. సోషల్ మీడియాలో ఈ మేరకు గట్టి వార్నింగ్ ఇచ్చింది. చిన్నారులను పొట్టనపెట్టుకున్న ఆయనను వదిలిపెట్టబోమని స్పష్టం చేసింది. ఇరాన్, ఇజ్రాయెల్-అమెరికా ఘర్షణలు మొదలై ఇప్పటికే రెండు వారాలు గడిచిపోయాయి. మరోవైపు, ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు కొన్ని రోజులుగా బహిరంగ ప్రదేశాల్లో కనిపించకపోవడంతో ఆయన ఆచూకీ విషయంలో రకరకాల వదంతులు వ్యాపించాయి. ఈ క్రమంలో ఇటీవల నెతన్యాహు పత్రికా సమావేశానికి సంబంధించిన వీడియో విడుదల కావడంతో అనుమానాలు మరింత బలపడ్డాయి. వీడియోలో నెతన్యాహు చేతికి ఏకంగా ఆరు వేళ్లు ఉండటం గమనించిన కొందరు అది ఏఐతో చేసిన వీడియో అని కామెంట్ చేశారు. ఈ క్రమంలో అమెరికా రాజకీయాల విశ్లేషకురాలు కాండిస్ ఓవెన్స్ కూడా నెతన్యాహు ఎక్కడ? అని ప్రశ్నించడం మరింత కలకలం రేపింది. ఈ నేపథ్యంలో ఇజ్రాయెల్ ప్రధాని కార్యాలయం కూడా స్పందించింది. ప్రధాని క్షేమంగా ఉన్నారని ఎక్స్ వేదికగా స్పష్టం చేసింది. నెట్టింట ప్రచారంలో ఉన్న వదంతులను కొట్టిపారేసింది. ఇక నెతన్యాహు తనయుడు కూడా కొన్ని రోజులుగా కనిపించట్లేదన్న వార్త కూడా ప్రస్తుతం కలకలం రేపుతోంది. సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉండే ఆయన మార్చ్ 9 నుంచి ఎలాంటి పోస్టులు పెట్టకపోవడంతో ఆందోళన వ్యక్తమవుతోంది. ఇక ఈ యుద్ధంలో ఇప్పటివరకూ దాదాపు 2 వేల మంది మరణించగా వారిలో అధిక శాతం మంది ఇరాన్ పౌరులేనని అంతర్జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి.

# ఎలక్షన్ నోటిఫికేషన్ కు ముందు మమత కీలక ప్రకటన- పురోహితులు, ముఅజ్జిన్‌ల గౌరవ వేతనం పెంపు

మొదటి పేజి తరువాయి

మమత కొనియాడారు. గౌరవ వేతనం కోసం పురోహితులు, ముఅజ్జిన్‌లు కొత్తగా సమర్పించిన అన్ని దరఖాస్తులనూ ఆమోదించామన్నారు. మత సామరస్యం, సంప్రదాయ వ్యవస్థలకు మద్దతు అనేవి తమ ప్రభుత్వానికి అత్యంత కీలకమైన అంశాలని ఆమె స్పష్టం చేశారు. ప్రతీ సామాజిక వర్గం, సంప్రదాయం వర్ధిల్లే అనుకూల వాతావరణాన్ని ఏర్పర్చేందుకు తమ ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందన్నారు. సుసంపన్నమైన మన ఆధ్యాత్మిక వారసత్వానికి సంరక్షణకర్తలుగా వ్యవహరిస్తున్న పురోహితులు, ముఅజ్జిన్‌లు గౌరవ వేతనాలకు అర్హులని సీఎం మమత చెప్పారు.

## ఈనెల నుంచే ఉద్యోగులు, పెన్షనర్లకు డీఏ బకాయిలు

"మాది మా - మాటీ - మనుష్ ప్రభుత్వం. మేం ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చాం. ప్రభుత్వ విద్యాసంస్థల లక్షలాది టీచర్లు, నాన్ టీచింగ్ సిబ్బంది, గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీలు, స్థానిక సంస్థల్లోని ఎయిడెడ్ విద్యా సంస్థల ఉద్యోగులు, పెన్షనర్లకు ఇచ్చిన వాగ్దానాలను కూడా



నిలబెట్టుకున్నాం. వాళ్లంతా ఆర్ఓపీఏ 2009 కరవు భత్యం (డీఏ) బకాయిలూ 2026 మార్చి నెల నుంచి అందుకుంటారు. రాష్ట్ర ఆర్థిక శాఖ విడుదల చేసిన నోటిఫికేషన్‌లోని మార్గదర్శకాల ప్రకారం ఉద్యోగులు, పెన్షనర్లు, రిటైర్డ్ ఉద్యోగులకు డీఏ బకాయిలు అందుతాయి" అని సీఎం మమత వెల్లడించారు.

## సుప్రీం కోర్టు ఆదేశాల ఎఫెక్ట్

ఐదో వేతన సంఘం సిఫారసులకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్ల చెల్లింపులు, ప్రయోజనాలలో సవరణలు చేసేందుకు రూపొందించిన మార్గదర్శకాలనే రివిజన్ ఆఫ్ పే అండ్ అలవెన్స్ (ఆర్ఓపీఏ) అంటారు. వీటిని అమలు చేయకపోవడాన్ని వ్యతిరేకిస్తూ బంగాల్‌కు చెందిన ఒక ప్రభుత్వ ఉద్యోగుల సంఘం గతంలో సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ఆర్ఓపీఏ మార్గదర్శకాల ప్రకారం 2008 ఏప్రిల్ 1 నుంచి 2019 డిసెంబరు 31 వరకు పెండింగ్‌లో ఉన్న కరవు భత్యం బకాయిలను ఉద్యోగులు, పెన్షనర్లకు అందించాలని కోరింది. ఉద్యోగ సంఘం వాదనతో ఏకీభవించిన సుప్రీంకోర్టు ధర్మాసనం, 2026 మార్చి 31లోగా 25 శాతం డీఏ బకాయిలను విడుదల చేయాలని బంగాల్ రాష్ట్ర ప్రభుత్వాన్ని 2025 మేలో ఆదేశించింది. మిగతా 75 శాతం డీఏ బకాయిలపై నిర్ణయాన్ని తీసుకోవడానికి నలుగురు రిటైర్డ్ జడ్జీలతో ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయమని బంగాల్ సర్కారుకు సుప్రీంకోర్టు నిర్దేశించింది. ఈనేపథ్యంలో డీఏ బకాయిలను ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు అందించాలని సీఎం మమత ఆదేశాలు జారీ చేశారు. ఈనెలలోనే వాళ్లందరికీ డీఏ బకాయిలు అందుతాయని వెల్లడించారు. సరిగ్గా అసెంబ్లీ ఎన్నికల వేళ ఉద్యోగులు, పెన్షనర్లను ప్రసన్నం చేసుకునేందుకే మమత ఈ నిర్ణయాన్ని తీసుకున్నారని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. బంగాల్ ఎన్నికల షెడ్యూల్‌పై ఈసీ ప్రకటన తర్వాత ఆదివారం సాయంత్రం నుంచి రాష్ట్రంలో ఎన్నికల కోడ్ అమల్లోకి రానుంది

# రాహుల్ గాంధీ భారత్‌ను, ప్రజాస్వామ్యాన్ని కించపరుస్తున్నారు

మొదటి పేజి తరువాయి

జరిగిన బహిరంగ సభ వేదికగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.

రాహుల్ క్షమాపణ చెప్పకపోగా, నిరసనకారులను పొగిడారు

"భారతదేశాన్ని ఏఐ విభాగంలో బలోపేతం చేసే లక్ష్యంతో ఏఐ ఇంపాక్ట్ సదస్సును దిల్లీలో నిర్వహించాం. కానీ కాంగ్రెస్ నేతలు అక్కడికి వెళ్లిపోయి, అర్ధనగ్నంగా నిరసన తెలిపారు. వాళ్లలాగే మేం కూడా రాజకీయాల్లో ఉన్నాం. గతంలో ప్రతిపక్షంగా పనిచేసిన అనుభవం సైతం మాకుంది. కానీ ఇలాంటి నిరసన కార్యక్రమాలను మేం నిర్వహించలేదు. ఏఐ సదస్సు అనేది వ్యక్తిగత రాజకీయాలు చేసుకునే ప్రదేశం కాదు. యావత్ ప్రపంచం భారతదేశ ఏఐ టెక్నాలజీని, ఆవిష్కరణలను చూడటానికి, పెట్టుబడులు పెట్టడానికి ఆ సదస్సుకు వచ్చింది. దేశానికి ముఖ్యమైన ఆ సదస్సు దగ్గర కాంగ్రెస్ యువజన విభాగం నేతలు అర్ధనగ్నంగా నిరసన తెలిపినందుకు రాహుల్ గాంధీ క్షమాపణ చెప్పకపోగా, ఆ నిరసనలో పాల్గొన్నవాళ్లను ధైర్యవంతులని పొగిడారు. దేశాన్ని అప్రతిష్టపాలు చేసేందుకే కాంగ్రెస్ ఆ నిరసన కార్యక్రమాన్ని నిర్వహించింది.ఏ బాధ్యతాయుత రాజకీయ పార్టీ కూడా అలా వ్యవహరించదని నేను భావిస్తున్నాను" అని అమిత్‌షా పేర్కొన్నారు.

## సత్తా ఉంటే బీజేపీని ఢీకొనండి

నిజంగా సత్తాయే ఉంటే నేరుగా ప్రజాక్షేత్రంలో బీజేపీని ఢీకొనాలని కాంగ్రెస్ పార్టీకి అమిత్‌షా సవాల్ విసిరారు. ఏఐ సదస్సు లాంటి అంతర్జాతీయ స్థాయి కార్యక్రమాల వద్ద నిరసనలకు దిగుతూ భారతీయ యువతకు అవకాశాలను కాంగ్రెస్ తగ్గిస్తోందన్నారు. అనవసరమైన చోట్ల ప్రతాపాన్ని చూపిస్తున్న రాహుల్ గాంధీ, పార్లమెంటు నుంచి మాత్రం పారిపోతున్నారని కేంద్ర హోంమంత్రి విమర్శించారు. ఇలా చేస్తున్నందుకు భారత ప్రజలు రాహుల్‌ను క్షమించరన్నారు.

## ఆరోగ్య రంగంలో అసోం స్వయం సమృద్ధి

"అసోంను ఆరోగ్య రంగంలో వికసిత రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు సీఎం హిమంత బిస్వ శర్మ చాలా శ్రమిస్తున్నారు. ఆయన శ్రమ వల్లే ఇప్పుడు అసోం ఆరోగ్య రంగంలో స్వయం సమృద్ధిని సాధించింది. అసోం ప్రజలు మెరుగైన వైద్యం కోసం రాష్ట్రం దాటి వెళ్లకుండా స్థానికంగానే వైద్య వసతులను కల్పించాలనేది తన లక్ష్యమని సీఎం హిమంత నాతో చెప్పారు. బంగాల్, ఈశాన్య రాష్ట్రాల పేద రోగులకు



మెరుగైన వైద్యాన్ని అందించే స్థాయికి అసోంను తీసుకెళ్లాలనే విజన్‌తో హిమంత ఉన్నారు. గతంలో అసోం ప్రజలు క్యాన్సర్ చికిత్స కోసం చెన్నై, ముంబయి, కర్ణాటక, దిల్లీలకు వెళ్లేవారు. కానీ ఇప్పుడు సమీపంలోని ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే ఆ చికిత్సను పొందుతున్నారు" అని కేంద్ర హోంమంత్రి అమిత్‌షా తెలిపారు.

# వ్యవస్థాపకుడు కాన్షీరామ్‌కు భారతరత్న ఇవ్వండి

మొదటి పేజి తరువాయి

బీఆర్ అంబేద్కర్ విషయంలో కాంగ్రెస్ చేసిన తప్పును బీజేపీ ప్రభుత్వం పునరావృతం చేయొద్దని, కాన్షీరామ్‌కు భారతరత్న ఇవ్వాలని బీఎస్‌పీ అధినేత్రి మాయావతి డిమాండ్ చేశారు.

'బహుజనులు, పేదల్లో రాజకీయ అవగాహన పెంచిన వ్యక్తి కాన్షీరామ్'

"ఈ రోజు మనం కాన్షీరామ్ జన్మదినోత్సవాన్ని జరుపుకుంటున్నాం. ఈ సందర్భంగా ఆయనకు మరణానంతరం భారతరత్న ఇవ్వాలని అభ్యర్థిస్తూ ప్రధాని మోదీకి లేఖ రాస్తున్నాను. కాన్షీరామ్ భారత రాజకీయాల స్వభావాన్ని మార్చారు. తన ఉద్యమాల ద్వారా బహుజనులు, పేదలలో రాజకీయ అవగాహన పెంచారు. బహుజనుల ఓటు, గొంతుక, ప్రాతినిధ్యం ముఖ్యమైనదని చాటిచెప్పారు. ఈ దేశం అందరికీ సమానంగా చెందుతుందని గుర్తు చేశారు. కాన్షీరామ్ ప్రయత్నాల కారణంగా ప్రజా జీవితంలోకి రావాలని ఎప్పుడూ ఆలోచించని చాలా మంది న్యాయం, సమానత్వాన్ని సాధించడానికి రాజకీయాలను ఒక మార్గంగా చూడటం ప్రారంభించారు" అని మోదీకి రాసిన లేఖలో రాహుల్ గాంధీ పేర్కొన్నారు.

## దేశ ప్రజాస్వామ్య పునాదులకు కాన్షీరామ్ బలోపేతం చేశారు : రాహుల్

భారత రాజ్యాంగం ప్రతి భారతీయుడికి సమానత్వం, గౌరవం, భాగస్వామ్యాన్ని అందిస్తుందని రాహుల్ గాంధీ తెలిపారు. కాన్షీరామ్ తన జీవితాన్ని సమాజంలోని అట్టడుగున ఉన్నవారికి ఈ విషయాన్ని తెలియజేయడానికి అంకితం చేశారని కొనియాడారు. కాన్షీరామ్ భారత ప్రజాస్వామ్య పునాదులను బలోపేతం చేశారని గుర్తు చేశారు.

చాలా ఏళ్లుగా దళిత మేధావులు, నాయకులు, కార్యకర్తలు కాన్షీరామ్‌ను భారతరత్నతో సత్కరించాలని డిమాండ్ చేస్తున్నారని పేర్కొన్నారు. వారి డిమాండ్ సరైనదేనని తాను భావిస్తున్నానని అన్నారు. "ఇటీవల నేను ఉత్తర్‌ప్రదేశ్‌లోని లఖ్‌నవూలో జరిగిన ఒక కార్యక్రమానికి హాజరయ్యాను. అక్కడ ఉన్న నాయకులు, సభలో పాల్గొన్నవారు కాన్షీరామ్‌కు భారతరత్న ఇవ్వాలనే డిమాండ్‌ను బలంగా పునరుద్ఘాటించారు. కాన్షీరామ్‌కు మరణానంతరం భారతరత్నను ప్రదానం చేయడం ద్వారా దేశానికి ఆయన చేసిన అపారమైన సేవలను గుర్తించినట్లవుతుంది. కాన్షీరామ్‌కు భారతరత్న ఇవ్వాలనే నా అభ్యర్థనను ప్రభుత్వం పరిశీలిస్తుందని ఆశిస్తున్నాను" అని రాహుల్ తెలిపారు.

## రాజ్యాంగం ప్రమాదంలో ఉంది: రాహుల్

అంతకుముందు బీఎస్‌పీ వ్యవస్థాపకుడు కాన్షీరామ్ జయంతి సందర్భంగా ఆయన సేవలను కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ ప్రశంసించారు. పేదలు, దళితులు, అణగారిన వర్గాల హక్కుల కోసం ఆయన అవిశ్రాంత పోరాటం, అంకితభావం తమకు ప్రేరణ అని రాహుల్ అన్నారు. ప్రస్తుతం రాజ్యాంగం ప్రమాదంలో ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్ అంబేద్కర్ రాసిన రాజ్యాంగంపై ప్రమాణం చేసి అధికారంలోకి వచ్చిన వారు స్వయంగా దానిని అణగదొక్కడానికి చూస్తున్నారని ఆరోపించారు. "బహుజనుల ఐకాన్ కాన్షీరామ్ జయంతి సందర్భంగా ఆయనకు గౌరవపూర్వక నివాళులు. పేదలు, దళితులు, అణగారిన వర్గాల హక్కుల కోసం ఆయన అవిశ్రాంత పోరాటం, అంకితభావం మనందరికీ స్ఫూర్తిదాయకంగా నిలుస్తాయి. రాజ్యాంగమే దళితులు, వెనుకబడిన తరగతులు, అణగారిన వర్గాల నిజమైన బలం అని ఆయన విశ్వసించారు. ఆ రాజ్యాంగమే నేడు ప్రమాదంలో ఉంది. అధికారంలో వాటా లేకుండా న్యాయం అసాధ్యం. ఇది కాన్షీరామ్ శాశ్వత సందేశం. బహుజన సమాజం రాజ్యాంగ హక్కుల కోసం కాంగ్రెస్ పార్టీ అండగా నిలిచింది. ఎల్లప్పుడూ నిలుస్తూనే ఉంటుంది."

– రాహుల్ గాంధీ, కాంగ్రెస్ ఎంపీ

సామాజిక న్యాయం, సమానత్వం కోసం పోరాటానికి కాన్షీరామ్ చేసిన కృషి ఎప్పటికీ స్ఫూర్తిదాయకంగా ఉంటుందని కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే ఎక్స్ పోస్టులో పేర్కొన్నారు. మరోవైపు, సమాజంలోని దళిత, అణగారిన, దోపిడీకి గురైన వర్గాలకు బలమైన గొంతుకైన కాన్షీరామ్ జయంతి సందర్భంగా ఆయనకు వినయపూర్వకమైన నివాళి అని కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ వాద్రా తెలిపారు. బహుజనుల ఐకాన్, సామాజిక సంస్కర్త అయిన కాన్షీరామ్ జయంతి సందర్భంగా ఆయనకు నివాళులని కాంగ్రెస్ ఎక్స్‌లో పోస్ట్ చేసింది.

## కాన్షీరామ్‌కు భారతరత్న ఇవ్వాలని మాయావతి డిమాండ్


బీఎస్‌పీ వ్యవస్థాపకుడు కాన్షీరామ్‌కు భారతరత్న ఇవ్వాలని ఆ పార్టీ అధినేత్రి, ఉత్తర్‌ప్రదేశ్ మాజీ సీఎం మాయావతి డిమాండ్ చేశారు. బీఆర్ అంబేద్కర్ విషయంలో కాంగ్రెస్ చేసిన తప్పును బీజేపీ చేయవద్దని కోరారు. కాన్షీరామ్ జయంతి సందర్భంగా ఈ మేరకు ప్రకటన విడుదల చేశారు. "ఎస్‌పీ, కాంగ్రెస్, బీజేపీ బహుజనుల గురించి మాట్లాడుతాయి. కానీ వారి అభ్యున్నతి కోసం చాలా అరుదుగా పనిచేస్తాయి. ముస్లిం సమాజం ఈ పార్టీలకు దూరమైంది. బ్రాహ్మణ సమాజం బీఎస్‌పీతో జతకట్టడంతో ఎస్‌పీ రాజకీయ, కుల వైరం తీవ్రమైంది. భారత రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ డాక్టర్ భీమ్‌రావ్ అంబేడ్కర్‌ను భారతరత్నతో సత్కరించని కాంగ్రెస్ పార్టీలాగే, కేంద్రంలోని ప్రస్తుత ఎన్డీఏ ప్రభుత్వం బహుజన నాయకుడు కాన్షీరామ్‌ని భారతరత్నతో సత్కరించడంలో ఇక ఆలస్యం చేయకూడదు. రాజ్యాంగంలో పొందుపరచినట్లుగా దేశంలో సమ సమాజాన్ని సృష్టించడంలో కాన్షీరామ్ చేసిన కృషి చరిత్రాత్మకమైనది. ఈ కారణంగా ఆయన ప్రజల హృదయాల్లో బతికే ఉన్నారు" అని మాయావతి పేర్కొన్నారు.

# రణరంగంలో ఏఐ తంత్రం!

ఇరాన్‌పై ఇజ్రాయెల్, అమెరికాల ఉమ్మడి దాడి- కృత్రిమ మేధ, ఎనలిటిక్స్ కలగలిసి ఆధునిక రణతంత్రాన్ని ఎంతలా మార్చేశాయో తెలియజేస్తోంది. యుద్ధంలో ఏఐ పాటవం ప్రపంచ వ్యాప్తంగా భద్రతా నిపుణులనూ, అంతర్జాతీయ సంబంధాల నిర్వాహకులనూ విశేషంగా ఆకర్షిస్తోంది. ఇరాన్ అధినాయకుడు ఆయతుల్లా అలీ ఖమేనీ హత్యకు దారితీసిన దాడిని విజయవంతం చేయడంలో ఇజ్రాయెల్ గూఢచారి సంస్థ మొసాద్‌తో పాటు సైబర్ పోరాట విభాగమైన యూనిట్-8200 వంటి నిగూఢ సంస్థలూ కీలక పాత్ర పోషించాయి. ఇరానీ సైన్యాధికారులు, ప్రభుత్వాధికారులు, శాస్త్రవేత్తలు, మత నాయకులతోపాటు ఇతరత్రా ప్రముఖులపైనా 2000 సంవత్సరం నుంచే మొసాద్ నిఘా వేసి ఉంచింది. అక్కడి టెహ్రాన్, నటాంజ్, కోమ్, ఇస్ఫహాన్, షిరాజ్, తాబ్రిజ్ వంటి ప్రధాన నగరాల్లో ఎలక్ట్రానిక్ నిఘా, ఫోన్ సంభాషణలు, ట్రాఫిక్ కెమెరా ఫుటేజ్‌ల ద్వారా సమాచారాన్ని సేకరిస్తూ వస్తోంది. వాహన రిజిస్ట్రేషన్ నంబర్లు, డ్రైవర్ల గుర్తింపు, పార్కింగ్ స్థలాలు, నాయకుల అంగరక్షకుల డ్యూటీ వేళల వివరాలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటోంది. చివరికి ఇరాన్ నేతల కదలికలను గోప్యంగా ఉంచడం కోసం వాహనాలను ఎప్పటికప్పుడు మారుస్తున్న సమాచారాన్ని సైతం దక్షిణ ఇజ్రాయెల్‌లోని సర్వర్‌లలో భద్రపరిచారు. ఇరాన్ నాయకుల భేటీ స్థలాలు, సమయాలు, అజెండా తదితర వివరాలనూ ఆ సర్వర్లలో ఉంచారు. ఇజ్రాయెలీలు దాడి చేయడానికి ముందు ఖమేనీ నివాసం సమీపంలోని మొబైల్ టవర్లను స్తంభింపజేశారు. దాడి విషయం భద్రతా సిబ్బందికి వెంటనే తెలియకుండా నిరోధించడానికే అలా చేశారు. ఆరోజు ఖమేనీ సమావేశ సమయం మారినా, వెంటనే పసిగట్టి దాడి సమయాన్ని మార్చేశారు. 'మాకు జెరూసలేం గురించి ఎంత బాగా తెలుసో, టెహ్రాన్ గురించీ అంతే క్షుణ్నంగా తెలుసు'నని ఒక ఇజ్రాయెల్ అధికారి వ్యాఖ్యానించారంటే వారి నిఘా సత్తా ఎంతటిదో అర్థం చేసుకోవచ్చు.

## క్షణాల్లో విశ్లేషణ

గూఢచారులు, నేతల మధ్య సందేశాలు, సంభాషణలతో పాటు ఉపగ్రహాల ద్వారా ఇరాన్ గురించి ఇజ్రాయెల్ సేకరించిన అపారమైన డేటాను మానవ సిబ్బంది విశ్లేషించడం అసాధ్యం. అందుకని డేటాను ప్రాసెస్ చేసి, త్వరగా నిర్ణయాలు తీసుకోవడానికి కృత్రిమ మేధ(ఏఐ), అడ్వాన్స్‌డ్ డేటా అనలిటిక్స్‌ను ఇజ్రాయెల్ వినియోగించింది. గతంలో గాజా యుద్ధంలో గాస్పెల్, లావెండర్ వంటి ఏఐ వ్యవస్థలను ఉపయోగించిన ఇజ్రాయెల్- ఇరాన్ యుద్ధంలో మాత్రం అమెరికా సాయం తీసుకుంటోంది. అగ్రరాజ్యానికి చెందిన 'పాలంటిర్స్ మావెన్' అనే రహస్య వేదిక ద్వారా ఆంత్రోపిక్ క్లాడ్ ఏఐని ఉపయోగించి ఇరాన్‌లోని వ్యక్తులు, స్థావరాలపై గురితప్పకుండా దాడులు చేసింది.



మానవశక్తికి సాధ్యంకాని రీతిలో ఈ ఏఐ సాధనాలు భారీ సమాచారాన్ని క్షణాల్లో విశ్లేషించగలవు. గూఢచారులు, ఉపగ్రహ చిత్రాలు, సిగ్నల్స్, కమ్యూనికేషన్ల ద్వారా సేకరించిన సమాచారాన్ని 'ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ' సమయంలో ఆంత్రోపిక్ క్లాడ్ ఏఐ విశ్లేషించింది. దాంతో యుద్ధనిపుణులు సమాచార సేకరణ-కార్యాచరణ మధ్య 'కిల్‌చైన్' సమయాన్ని గణనీయంగా తగ్గించగలిగారు. 'కిల్‌చైన్' అనేది సైన్యం అనుసరించే దశలవారీ యుద్ధ ప్రక్రియ: శత్రు లక్ష్యాలను గుర్తించడం, ప్రత్యర్థి సమాచారాన్ని విశ్లేషించడం, దాడికి నిర్ణయం తీసుకోవడం, దాన్ని అమలు చేయడమనే అంచెలు ఇందులో ఉంటాయి. డేటా విశ్లేషణ, నిఘా సమాచార సేకరణ, వ్యూహాత్మక అంచనాలు, కమ్యూనికేషన్లకు అంతరాయం కలిగించడం వంటి అంశాల్లో ఏఐ ఎంత కీలకమో ప్రస్తుత యుద్ధం నిరూపించింది. సైనిక విశ్లేషకులకు వివిధ వర్గాలు, సాధనాల ద్వారా అందిన సమాచారాన్ని విశ్లేషించి, శత్రువుపై విరుచుకుపడేందుకు అధునాతన సాంకేతికతలు ఎంతో సాయపడ్డాయి. అమెరికా, ఇజ్రాయెల్‌లు విస్తృతంగా డేటాను మదింపు చేయడం ద్వారా ఇరాన్ సైనిక మౌలిక సదుపాయాల గురించి స్పష్టమైన చిత్రాన్ని రూపొందించుకున్నాయి. ఇజ్రాయెల్ నుంచి ఇరాన్‌కు క్షిపణి ప్రయాణించే సమయాన్ని సైతం లెక్కించి, గురితప్పకుండా దాడులు నిర్వహించేలా ప్రణాళికలు రూపొందించారు. ఈ అంచనాల ఆధారంగానే బంకర్-బస్టర్ బాంబులు కూర్చిన క్షిపణులను ప్రయోగించి ఇరాన్‌లో కీలక నేతలను మట్టుపెట్టగలిగారు.

## భారత్ ఎక్కడుంది?

అమెరికా, ఇజ్రాయెల్ తరహాలో ఆటోమేటిక్ దాడి నిర్ణయాల కోసంగానీ, 'కిల్‌చైన్'ను వేగవంతం చేయడానికిగానీ ఇండియా ఏఐని ఉపయోగించిన సందర్భం లేదు. ప్రస్తుతం దేశ సైనిక కార్యకలాపాల్లో ఏఐ వినియోగం రక్షణ, విశ్లేషణ, అనుకరణ వంటి కొన్ని విభాగాలకే పరిమితమైంది. యుద్ధానికి సంబంధించిన తుది నిర్ణయాలన్నీ మనుషులే తీసుకుంటున్నారు. భారతీయ 'సాక్షం', 'ఆకాశతీర్' వంటి ఏఐ వేదికలు నిఘా, యుద్ధరంగ విశ్లేషణ, రక్షణ సమన్వయంపై దృష్టి పెడుతున్నాయి. డీఆర్‌డీవోకు చెందిన కృత్రిమమేధ, రోబోటిక్స్ కేంద్రం వంటి సంస్థలు ఉపగ్రహాలు, డ్రోన్ల ద్వారా సేకరించిన డేటాను విశ్లేషించే వ్యవస్థలను అభివృద్ధి చేస్తున్నాయి. డీసీఎక్స్ సిస్టమ్స్, అవాంటెల్, జెన్ టెక్నాలజీస్, సోలార్ వంటి ప్రైవేట్ సంస్థలు సైతం ముప్పును గుర్తించే సాధనాల రూపకల్పనలో సహకరిస్తున్నాయి. చైనా, పాకిస్థాన్‌ల నుంచి ఎదురయ్యే ముప్పుతో పాటు ఉగ్రవాద దాడులను సమర్థంగా ఎదుర్కోవడానికి స్వయంప్రతిపత్తి కలిగిన ఏఐ అప్లికేషన్లను ఇండియా వెంటనే అభివృద్ధి చేసుకోవాల్సి ఉంది. అమెరికా 'ప్రాజెక్ట్ ఎథీనా', 'సెంటినెల్ సైబర్' వంటి ఏఐ వ్యవస్థలను... ఇజ్రాయెల్ ఏమో 'ఐరన్ విజన్' వంటి వాటిని యుద్ధ రంగంలో వాడుతోంది. ఆత్మనిర్భర్ భారత్ కింద ఇండియా వీటిని అధ్యయనం చేసి, మెరుగైన స్వదేశీ సాంకేతికతను అభివృద్ధి చేసుకోవాలి. అమెరికా, ఇజ్రాయెల్- ఇరాన్ సంఘర్షణ... సమాచారాన్ని ఏఐతో విశ్లేషించడం ద్వారా సునిశితమైన దాడులను అత్యంత లాఘవంగా పూర్తిచేయవచ్చని నిరూపిస్తోంది. భారత్ కూడా మానవ నిఘాను అత్యాధునిక కృత్రిమ మేధ, అత్యంత కచ్చితత్వంతో దాడులు చేపట్టే వ్యవస్థలతో అనుసంధానించాల్సి ఉంది. అయితే, రాత్రికి రాత్రే ఇది ఏర్పాటు కాదు కాబట్టి, అందుకు ఇప్పటి నుంచే గట్టి కృషి జరగాలి.

# పంటలు ఎండిపోకుండా సాగునీరు అందించాలి

**బి ఆర్ ఎస్ సీనియర్ నేత మాజీ మంత్రి నాగం జనార్దన్ రెడ్డి**

నాగర్ కర్నూల్ మండలం మార్చి 15( వార్త నిర్భయం )

నాగర్కర్నూల్ జిల్లా ప్రభుత్వం రైతులకు సాగునీరు అందించాలి పంటలు ఎండిపోకుండా చూడాలని బిఆర్ఎస్ సీనియర్ నేత మాజీ మంత్రి నాగం జనార్దన్ రెడ్డి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు పంటలు వాడు పడుతున్నాయని త్వరగా నీరు సరఫరా చేయకపోతే ఎండిపోయే ప్రమాదం ఉందని అన్నారు పంటలు ఎండిపోకుండా రిజర్వాయర్లు నీళ్లు నింపాలి అప్పుడే సాగునీరు కోరత ఉండాలని అన్నారు కొల్లాపూర్ నియోజక వర్గంలో సున్నపురాల నుండి కుడికిల వరకు మూడున్నర కిలోమీటర్ల పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పనులు పూర్తి చేస్తే సాగునీటి సమస్య ఉండదని జిల్లా వ్యాప్తంగా 57 టీఎంసీలు నీరు రిజర్వాయర్ లో నింపుకోవచ్చు నాలుగు మోటర్లు కూడా నడపవచ్చని తద్వారా సాగునుడి సమస్య ఉండదని ఆయన వివరించారు బిఆర్ఎస్ ప్రభుత్వంలో సాగునీటి సమస్య విద్యుత్ సమస్య ఉండేది కాదని కానీ ఈ ప్రభుత్వంలో పర్యవేక్షణల లేక ఎమ్మెల్యే ఎమ్మెల్సీ మంత్రులు ఎంపీలు సాగునుటిపై సమీక్షచేసి పంటలు ఎండిపోకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు రైతులకు సమస్య వస్తే తాను ఊరుకోనన్ని పంటపొలాలు తిరిగి రైతులకు అన్యాయం జరగకుండా సాగు నీటి సమస్య తీరేవరకు ఉద్యమాన్ని ఇస్తారని నాగం ప్రభుత్వాన్ని హెచ్చరించారు రైతంగాని ప్రభుత్వాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు విద్యుత్ కోరత లేకుండా చూడాలని కోరారు రైతులకు మద్దతు ధర మొక్కజొన్న పంటలకు వచ్చే విధంగా మార్కెట్లో చూడాలని డిమాండ్ చేశారు ప్రభుత్వం మద్దతు ధర 2,400 ఉండగా ఈరోజు 1718 రూపాయలు క్వింటాలకు మార్కెట్లో వచ్చిందని 700 రూపాయలు తేడా వచ్చి రైతు నష్టపోవాల్సి వస్తుందని ఆయన వివరించారు రైతులకు మొక్కజొన్న ధర వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని



ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు ఈ సమావేశంలో నాగర్ కర్నూల్ లో మున్సిపాల్ కౌన్సిలర్ అర్జునయ్య వచ్చిందని 700 రూపాయలు తేడా వచ్చి రైతు నష్టపోవాల్సి వచ్చిందని ఆయన వివరించారు రైతులకు మొక్కజొన్న మద్దతు ధర వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు ఈ సమావేశంలో నాగర్కర్నూలు మున్సిపాల్ కౌన్సిలర్ అర్జునయ్య తిమ్మాజిపేట పాండు మాజీ జెడ్పిటిసి బాల గౌడ్ సీనియర్ నాయకులు రవి ఐతుల్ లక్ష్మయ్య సత్యం భీముడు పాల్గొన్నారు

# మోడీ సర్కారు దూరదృష్టి లోపం

**చిన్న పరిశ్రమలపై యుద్ధం ఎఫెక్ట్.**

హైదరాబాద్ మార్చి 15 (వార్త నిర్భయం)

ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయిల్ దేశాల యుద్ధోన్మాదం ప్రపంచ దేశాలపై తీవ్ర ప్రభావాన్ని చూపుతున్నది. భారత్‌లోనూ ఇదే పరిస్థితి కనబడుతోంది. దేశంలోని పరిశ్రమల పైనా యుద్ధం ఎఫెక్ట్ పడుతోంది. హార్ముజ్ జలసంధి మూసివేత కారణంగా భారత్‌లోని చిన్న, మధ్య తరహా పరిశ్రమలు కుదేలవుతున్నాయి. ఎల్పీజీ, సహజ వాయువు సరఫరా అంతరాయం ఏర్పడడంతో టెక్స్‌టైల్, ప్లాస్టిక్, ఆటోమొబైల్ వంటి రంగాల్లో ఉత్పత్తి నిలిచిపోతోంది. ఖర్చులు భారీగా పెరుగుతున్నాయి. దీంతో చిన్న తయారీదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కార్మికుల ఉపాధి కూడా దెబ్బ తినే పరిస్థితులు ఏర్పడుతున్నాయి. అయితే కేంద్రంలోని మోడీ ప్రభుత్వం ఈ సంక్షోభాన్ని ముందుగా అంచనా వేయడంలో విఫలమైందనే విమర్శలు చిన్న, మధ్య తరహా పరిశ్రమల వర్గాల్లో వెల్లువెత్తుతున్నాయి.

**హార్ముజ్' ద్వారా భారత్‌కు 90 శాతం ఎల్పీజీ**

అమెరికా-ఇజ్రాయిల్ దాడుల తర్వాత ఇరాన్ యుద్ధం మూడో వారంలోకి ప్రవేశించింది. అప్పటి నుంచి ప్రపంచ ఇంధన మార్కెట్లలో అనిశ్చితి కనిపించిన విషయం విదితమే. దాడులు, ప్రతిదాడుల కారణంగా ప్రపంచ వాణిజ్యంలో కీలక మార్గమైన హార్ముజ్ జలసంధి ఆంక్షలను ఎదుర్కొంటున్నది. ఇందులో పరిమిత దేశాలకు మాత్రమే అనుమతి ఉన్నట్టు కొన్ని నివేదికలు చెప్తున్నాయి. ఈ మార్గం భారత్‌కూ చాలా కీలకం. ఎందుకంటే ఈ మార్గం ద్వారానే భారత్‌కు సరఫరా అయ్యే ఎల్పీజీలో దాదాపు 90 శాతం వస్తుంది.

**పరిస్థితిని అంచనా వేయడంలో కేంద్రం విఫలం**

ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయిల్‌లు యుద్ధానికి దొగొచ్చనే వార్తలు గత కొన్ని నెలల నుంచి కూడా వస్తున్నాయి. ఇలాంటి పరిస్థితుల నేపథ్యంలో ముప్పును ముందుగానే అంచనా వేయాల్సిన మోడీ సర్కారు.. అందులో విఫలమైందని విశ్లేషకులు చెప్తున్నారు. యుద్ధానికి ముందు ఇజ్రాయిల్ దేశ పర్యటనకు వెళ్లి వచ్చిన ప్రధాని మోడీడ ఆ తర్వాత అటు వైపుగా చర్యలు తీసుకోలేదని వివరిస్తున్నారు. కేంద్రం నిర్లక్ష్యంతో దేశంలోని పరిశ్రమలకు గ్యాస్ కొరత ఏర్పడిందని అంటున్నారు.

**మూతపడుతున్న పరిశ్రమలు.. ఆగిపోతున్న పనులు**

యుద్ధంతో పాటు కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరితో దేశంలోని చిన్న పరిశ్రమలు తీవ్రంగా దెబ్బ తింటున్నాయి. వేలాది మంది కార్మికుల ఉపాధి ప్రమాదంలో పడింది. ఇది దేశ ఆర్థిక వ్యవస్థపైనా ప్రతికూల ప్రభావాన్ని చూపెడుతుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. తమిళనాడులోని కోయంబత్తూరులో ఒక ఫౌండ్రీ యజమాని తమకు రోజుకు ఐదు గ్యాస్ సిలిండర్లు అవసరమవుతాయనీ, అవి లేకుండా తాము పని చేయలేమని చెప్తున్నారు. హర్యానాలోని పానిపట్‌లో టెక్స్‌టైల్ డైయింగ్ యూనిట్లకు గ్యాస్ లేకపోవడంతో పనులు ఆగిపోయాయి. అక్కడ సుమారు 10వేల టెక్స్‌టైల్ యూనిట్లు ఉండగా.. వాటిలో దాదాపు వెయ్యి డైయింగ్ యూనిట్లను ఆపేయడం పరిస్థితి తీవ్రతను తెలియజేస్తున్నది.

**చిన్న పరిశ్రమల యజమానులు, కార్మికులపై ప్రభావం**

గ్యాస్ కొరతతో పాటు ముడి సరుకుల ధరలు కూడా పెరుగుతున్నాయి. పెట్రోలియం ఆధారిత పాలిస్టర్ దారాలు, ప్లాస్టిక్ బ్యాగుల ధరలు పెరిగాయి. ప్లాస్టిక్ తయారీలో ఉపయోగించే 'దాణా' ధరలు కొన్ని ప్రాంతాల్లో 50 శాతం వరకు ఎగబాకాయి. ఆటోమొబైల్ రంగానికి అవసరమైన స్టీల్ ధరలు కూడా 10-15 శాతం పెరిగాయి. దీంతో చిన్న పరిశ్రమల యజమానులు ఆర్థిక నష్టాలు ఎదుర్కొనే పరిస్థితి ఏర్పడింది. కొందరు ఇప్పటికే ఉత్పత్తి తగ్గించారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే కార్మికుల పనివేళలను కూడా తగ్గించే పరిస్థితి కూడా రావచ్చన్ని పరిశ్రమల వర్గాలు హెచ్చరిస్తున్నాయి.



**ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలి**

పెద్ద కార్పొరేట్ కంపెనీలు తాత్కాలిక నష్టాలను భరించగలవు. కానీ చిన్న పరిశ్రమలు మాత్రం కొన్ని రోజుల గ్యాస్ కొరతకే మూతపడే పరిస్థితి వస్తుంది. కాబట్టి ప్రభుత్వం ఈ విషయంలో కొన్ని ప్రత్యేక చర్యలు తీసుకోవాలని నిపుణులు, విశ్లేషకులు సూచిస్తున్నారు. "పరిశ్రమలకు ప్రత్యేక గ్యాస్ కోటా ఇవ్వాలి. ధరల పెరుగుదలను నియంత్రించాలి. చిన్న పరిశ్రమలకు ఆర్థిక సహాయం ప్రకటించాలి. లేకపోతే ఈ సంక్షోభం పరిశ్రమలు మూతపడటానికి, నిరుద్యోగం పెరగడానికి దారి తీయొచ్చు" అని వారు హెచ్చరిస్తున్నారు. ప్రస్తుత పరిస్థితుల నేపథ్యంలోనైనా కేంద్రం చిన్న, మధ్య తరహా పరిశ్రమల విషయంలో ప్రత్యేక దృష్టిని సారించాలని సూచిస్తున్నారు.

**మోడీ సర్కారు దూరదృష్టి లోపం**

భారత్‌లో నెలకొన్న ఈ పరిస్థితి యుద్ధ ప్రభావమే కాదనీ, కేంద్ర ప్రభుత్వ ప్రణాళికా లోపం కూడా అని విశ్లేషకులు చెప్తున్నారు. వాస్తవానికి భారత్ ప్రపంచంలో అతిపెద్ద ఇంధన దిగుమతి దేశాలలో ఒకటి. అలాంటి దేశం యుద్ధ పరిస్థితులను ముందుగానే అంచనా వేయాలి. ప్రత్యామ్నాయ సరఫరా మార్గాలు ముందుగానే సిద్ధం చేయాలి. వ్యూహాత్మక గ్యాస్ నిల్వలు పెంచాలి. చిన్న పరిశ్రమలకు అత్యవసర మద్దతు ప్యాకేజీలు ప్రకటించాలి. అయితే మోడీ ప్రభుత్వం నుంచి ఈ చర్యలేవీ కనిపించకపోవటం గమనార్హం. ఈ పరిస్థితి ఇంధన భద్రతపై ప్రభుత్వ దూరదృష్టి లోపం, చిన్న పరిశ్రమల పట్ల విధానాల్లో నిర్లక్ష్యాన్ని స్పష్టం చేస్తున్నదని విశ్లేషకులు చెప్తున్నారు.

# అడవిలో ఆయుధాలు..జనంలోకి అన్నలు.

**దేవులపల్లి అమర్.**

హైదరాబాద్ మార్చి 15 (వార్త నిర్భయం) మావోయిస్టు ఉద్యమం అంతం అయిందా? కేంద్రప్రభుత్వం పదేపదే ప్రకటించినట్టుగా ఈనెల 31తో ఆ ఉద్యమ ప్రస్థానం ముగిసినట్టేనా? దశాబ్దాల తరబడి ఎన్నో ప్రజా ఉద్యమాలు నిర్మించి, రహస్య ఉద్యమంలో పాల్గొని సాయుధ పోరాటబాట పట్టిన సిపిఐ (మావోయిస్టు) పార్టీ అంతమైనట్టేనా? లేక తన పార్టీని రహస్య ఉద్యమం వైపు నుండి చట్టంబాట పట్టించిందా? అధికారికంగా మావోయిస్టు పార్టీ చట్టబద్ధంగా ఇతర రాజకీయపార్టీల మాదిరిగానే ప్రజలమధ్యకు వచ్చి చట్టానికి లోబడి తమ కార్యాచరణ కొనసాగిస్తామని ప్రకటించలేదు. పార్టీ కేంద్ర కార్యదర్శి నంబళ్ల కేశవరావు ఎన్‌కౌంటర్‌లో మరణించాక ఆ స్థానంలోకి వచ్చిన తిప్పిరి తిరుపతి అలియాస్ దేవ్‌జీ మాటల్లోనే కార్యదర్శిగా ఆయన నియామకం ఇంకా అధికారికం కాలేదు. అటువంటప్పుడు ఆయన చేసే విధానప్రకటన ఏదీ పార్టీ తరఫున అధికారికంగా చేసినట్టు ఎలా అవుతుంది? దేవ్‌జీ చెప్తున్నదానికి, అంతకుముందే లొంగిపోయిన మల్లోజుల వేణుగోపాల్ అలియాస్ సోనీ చెబుతున్నదానికి బోలెడు వ్యత్యాసం కనిపిస్తున్నది. సోను తదితరులు పెద్దసంఖ్యలో మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ ఎదుట ఆయుధాలతో లొంగిపోయారు. తిప్పిరి తిరుపతి, మల్ల రాజిరెడ్డి తదితరులు తెలంగాణ డిజిపి ఎదుట లొంగిపోయారు. వారు లొంగిపోయారా లేక అరెస్ట్ అయ్యారా అనేది స్పష్టంగా లేదు. ఆయుధాలు మాత్రం అడవుల్లో దాచి వచ్చామని చెప్తున్నారు. శాంతిభద్రతలు రాష్ట్రాల సమస్య. వామపక్ష తీవ్రవాద ఉద్యమాన్ని సమర్థించేవారు, దానిపట్ల సానుభూతి ప్రకటించేవారు.. ఇది శాంతిభద్రతల సమస్య కాదు, సామాజిక సమస్యగా చూడాలని ఎంత చెప్పినా ప్రభుత్వాలు మొదటినుండి నక్సలైట్ ఉద్యమాన్ని శాంతిభద్రతల సమస్యగానే పరిగణిస్తూ వచ్చాయి. కాబట్టి నక్సలైట్ ఉద్యమాన్ని 2014లో భారతీయ జనతా పార్టీ నాయకత్వంలోని ఎన్‌డిఏ అధికారంలోకి వచ్చేవరకు కూడా కేంద్రం దాన్ని శాంతిభద్రతల సమస్యగానే పరిగణించి అవసరమైన చర్యలు తీసుకునే బాధ్యతను రాష్ట్రాలకే వదిలిపెట్టింది. 2014 తరువాత ఈ అంశాల్లోకి కేంద్రం చొరబాటు పతాకస్థాయికి చేరింది. ఆపరేషన్ కగార్‌తో కర్రెగుట్టలను జల్లెడపట్టి వందలాదిమందిని అంతం చేసి, వందల సంఖ్యలో లొంగుబాట్లకు దారితీసిన ఆపరేషన్ ఇది. దీని కొనసాగింపుగా, వందల సంఖ్యలో మావోయిస్టులు బయటకు రావడం లొంగుబాటా, అరెస్టా అనేది స్పష్టంగా



లేదు. తిప్పిరి తిరుపతి రెండురోజుల క్రితం పలు మీడియా సంస్థలకు ఇచ్చిన ఇంటర్వ్యూలో చెప్పినట్టే వారు లొంగకపోతే, అరెస్టయి ఉంటే బయట స్వేచ్ఛగా ఎలా తిరుగుతున్నారు? టివి చానళ్ళతో మాట్లాడటానికి అవకాశం ఎలా వచ్చింది? పోనీ, బెయిల్ మీద ఉన్నారా? అనేవి ఏవీ తెలియదు. తాము ఆయుధాలను అడవిలో ఉంచి వచ్చామనీ, తమను అరెస్ట్ చేసారనీ చెపుతున్నవారు ముఖ్యమంత్రితో సహా ఇతర అధికారులను, రాజకీయ నాయకులను ఎలా కలుసుకోగలుగుతున్నారు? ప్రజాసమస్యల మీద చట్టం పరిధిలో పోరాటం చెయ్యడానికి అజ్ఞాతంనుండి బయటికి వచ్చినవాళ్ళను అరెస్ట్ చేసి జైలులో పెట్టాలని చెప్పడం లేదు కానీ ఈ గందరగోళం ఎందుకు ఉందనేదే ప్రశ్న.

# రామంతాపూర్ భగాయత్‌లో అభివృద్ధి పనులు..

**సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణం.**

**బస్తీబాటలో పరమేశ్వర్ రెడ్డి.**

ఉప్పల్ మార్చి 15 (వార్త నిర్భయం)

రామంతాపూర్ భగాయత్‌లో త్వరలోనే సీసీ రోడ్లు, డ్రైనేజీలను నిర్మాణం చేయనున్నట్లుగా ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు.ఇతర కాలనీలతో సమానంగా రామంతాపూర్ భగాయత్‌లోని కాలనీలను అభివృద్ధి చేయనున్నట్లుగా తెలిపారు. బస్తీబాట కార్యక్రమంలో భాగంగా ఆదివారం పరమే శ్వర్ రెడ్డి రామంతాపూర్ భగాయత్‌లోని కాలనీలలో విస్తృతంగా పర్యటించారు.ఈ సందర్భంగా పరమేశ్వర్ రెడ్డి దృష్టికి కాలనీ వాసులు రోడ్లు, డ్రైనేజీలు, ఇతర మౌలిక సదుపాయాలను కల్పించేందుకు కృషి చేస్తున్నట్టుగా చెప్పారు.కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు రసాల ఖాసీం గౌడ్,,కే సామి గొలుసుల స్వామిగారు నాగరాజు శంకర్ గౌడ్ శ్యామ్, మీరాజ్, అజయ్, లోన్ శ్రీను,శ్రీను పటేల్, రాఘవ నేత, పి శివకుమార్, మధు,శ్రీనివాస్ గౌడ్,శ్రీను, బాలరాజు, చిన్న నరసింహ,

భాను, చరణ్ తేజ, కుమార్, నిరంజన్, జాంగిర్, సైదులు, స్వామి, అర్జున్, యాదగిరి చారి, సోమేష్ మరియు కాలనీవాసులు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు తాఫీక్ గారు,ఉప్పల్ నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు ఆకారపు అరుణ్ గారు,ఎండి రఫీక్,వల్లపు శ్రీకాంత్ యాదవ్, గరిక సుధకర్, బాలయ్య బాబు,కరిప శంకర్ ,

ఉపేందర్ రెడ్డి, బుక్క సురేష్, ప్రవీణ్, శ్రీనివాస్ చారీ, శ్రీనివాస్ గౌడ్, కృష్ణ, శామ్యూల్, సందీప్, శ్రీధర్, జి భాస్కర్, జంగయ్య, బాబు రావు, అరుణ్ సాయి, మీట్టు గౌడ్, సతీష్ గౌడ్, భాస్కర్, కృష్ణ,సి జంగయ్య, విజయ్, అంబికా, శోభ,బుల్లెట్ అశోక్, సచిన్,నవీన్, అశోక్ ,రినీష్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు



## మోస్రా గ్రామ శివారులో గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి



వర్ని పోలీసుల దర్యాప్తులో హిట్ అండ్ రన్ కేసు గుర్తుతెలియని మృతుడి పై సమాచారం కోరుతున్న పోలీసులు వర్ని మార్చి 15 వార్త నిర్భయం: నిజామాబాద్ జిల్లా వర్ని మండలంలోని మోస్రా గ్రామ శివారులో శుక్రవారం అర్ధరాత్రి విషాదకర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న ఓ గుర్తుతెలియని వ్యక్తిని గుర్తు తెలియని వాహనం ఢీకొట్టినట్లు సమాచారం. ఈ ప్రమాదంలో సుమారు 40 సంవత్సరాల వయస్సు గల ఆ వ్యక్తికి తలకు తీవ్ర గాయాలు అయ్యాయి. ఘటనను గమనించిన స్థానికులు వెంటనే అతడిని చికిత్స నిమిత్తం నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం అతడు మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఈ ఘటనపై మోస్రా గ్రామానికి చెందిన భూపాల్ రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు వర్ని పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ప్రమాదానికి కారణమైన వాహనం, డ్రైవర్‌ను గుర్తించే దిశగా పోలీసులు విచారణ కొనసాగిస్తున్నారు. మృతుడు ఎవరో ఇప్పటివరకు గుర్తించలేకపోయామని తెలిపారు. కింద తెలిపిన వ్యక్తి వివరాలు ఎవరైనా గుర్తిస్తే వెంటనే వర్ని పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని పోలీసులు ప్రజలను కోరారు.

## గ్రామాల అభివృద్ధియే ప్రభుత్వ లక్ష్యం: మంత్రి జూపల్లి

## పెద్దమడూరులో రూ.21 లక్షలతో సీసీ రోడ్ల పనులకు శంకుస్థాపన



వనపర్తి బ్యూరో మార్చి 15 (వార్త నిర్భయం) కొల్లాపూర్.గ్రామాల సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని రాష్ట్ర అబ్కారీ, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. కొల్లాపూర్ నియోజకవర్గంలోని పెద్దమడూరు గ్రామంలో ఆదివారం ఉపాధి హామీ పథకం (ఎన్ఆర్ఈజీఎస్) నిధులతో చేపట్టనున్న రూ.21 లక్షల వ్యయంతో సీసీ రోడ్ల నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గ్రామాలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడం ద్వారా ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపరచాలన్నదే ప్రభుత్వ సంకల్పమని పేర్కొన్నారు. గ్రామాల్లో అంతర్గత రోడ్లు, మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. గతంలో పెండింగ్‌లో ఉన్న పనులను దశలవారీగా పూర్తి చేస్తూ గ్రామాల అభివృద్ధిని వేగవంతం చేస్తున్నామని చెప్పారు.పనుల అమలులో నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ పడకూడదని సంబంధిత అధికారులకు మంత్రి ఆదేశించారు. పనులను నిరంతరం పర్యవేక్షిస్తూ.. పూర్తి చేయాలని సూచించారు. గ్రామాభివృద్ధి కార్యక్రమాల్లో ప్రజలు కూడా భాగస్వాములు కావాలని మంత్రి పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, మండల స్థాయి అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## 77 వ రోజులుగా గొల్లపల్లి చిర్కపల్లి రిజర్వాయర్ అఖిలపక్ష పోరాట సమితి




ఏదుల మండలం మార్చి 15( వార్త నిర్భయం )

ఏదుల మండల కేంద్రంలో జరుగుతున్న దీక్ష నేటికీ 77వ రోజులుగా గొల్లపల్లి చిరుక్కపల్లి రిజర్వాయర్ వ్యతిరేక అఖిలపక్ష పోరాట సమితి ఆధ్వర్యంలో నిరసన దీక్ష శిబిరం రోజురోజుకు ప్రజాదారణ పొందుతూ ప్రజల్లో చైతన్యం నింపుతూ ఉద్యమం ఉగ్రరూపం దాల్చుతుంది అనడానికి ఈ ఫోటోలో ఉన్న జన జాతరను సాక్ష్యం పాలకులు అసమర్థులు అయినప్పుడు ప్రజల్లో అగ్రం కట్టలు తెంచుకుంటుంది వనపర్తి ఎమ్మెల్యే తుడి మెగా రెడ్డి ధన దహానికి మా గ్రామాల భూములను బల్లి ఇచ్చేవాళ్లం కాదు నీవు ఇక్కడికి వచ్చి టెంకాయలు కాదు పగిలేది మీ తలకాయలు అన్ని నేడు దీక్ష శిబిరానికి మద్దతుగా వచ్చిన రేవెల్లి మాజీ జెడ్పిటిసి బోర్ల భీమన్న రేవెల్లి మాజీ సర్పంచ్ శివరాం రెడ్డి చెన్నూరు మాజీ సర్పంచ్ నాగరాజు మాట్లాడారు ఈ కార్యక్రమంలో దొడ్ల రాములు మద్గం రమేష్ అబ్దుల్ మహమ్మద్ బంకల సునీల్ దొడ్ల ఇందిరా జెట్టి కృష్ణయ్య ప్రేమ్ కుమార్ బంకల స్వామి కిష్టరాజు సుబ్బారెడ్డి నరేందర్ రెడ్డి బోయ కృష్ణయ్య చిన్న గొల్లబుడ్డయ్య శాంతమ్మ సింహాద్రి తదితరులు పాల్గొన్నారు

## అసెంబ్లీ లో ఎమ్మెల్యేలు అందరికీ డ్రగ్ టెస్ట్ లు చేయించాలి


**- ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి**



జడ్చర్ల, మార్చ్ 15, వార్త నిర్భయం

ప్రజా ప్రతినిధులు అందరూ బాధ్యతయుతంగా అందరికీ ఆదర్శప్రాయంగా ఉండాలని, అందుకే అసెంబ్లీకి వచ్చే ఎమ్మెల్యేలందరికీ డ్రగ్స్ టెస్టులు చేయించాలని జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుద్ రెడ్డి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డినీ కోరారు. డ్రగ్స్ టెస్టులకు సంబంధించిన రక్త పరీక్షను అందరికంటే ముందుగా తానే చేయించుకుంటానని ఆయన ప్రకటించారు. డ్రగ్స్ టెస్టులలో పాజిటివ్ గా తేలిన వారిని కఠినంగా శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు. మొయినాబాద్ లో మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్ రెడ్డికి చెందిన ఫామ్ హౌస్ లో డ్రగ్స్ పార్టీ జరగడం అందులో ఐదు మందికి డ్రగ్స్ పాజిటివ్ గా తేలిన నేపథ్యంలో ఆదివారం జడ్చర్లలో విలేకరులతో మాట్లాడారు. ప్రజా ప్రతినిధులుగా ఉండేవారు డ్రగ్స్ సేవించడం సమాజానికి ప్రమాదకరమని అనిరుద్ రెడ్డి చెప్పారు. సిగరెట్ పేట్టలపై వాటిని కాలిస్తే ఊపిరితిత్తులు పాడై పోతాయని, మద్యం బాటిళ్లపై వాటిని సేవించడం ఆరోగ్యానికి హానికరమని రాసి ఉన్న ఎవరు పట్టించుకోవడంలేదని వాపోయారు. మొయినాబాద్ ఫామ్ హౌస్ లో డ్రగ్స్ సేవించినట్లు పాజిటివ్ గా తేదీన వారిలో ప్రజా ప్రతినిధులు ఉండడం పట్ల ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఇతరుల పేరు మీద ఉన్న లైసెన్స్ ఉన్న గన్ను తీసుకొని దాంతో కాల్పులు జరపడం చూస్తే నిందితులకు ఎలాంటి భయం లేదని అర్థమవుతుందన్నారు. మొయినాబాద్ ఫామ్ హౌస్ లో డ్రగ్స్ సేవించి పాజిటివ్ గా తేలిన వారిని ఎంత కఠినంగా శిక్షించాలంటే ఆ శిక్షను చూసి ఇతరులు ఎవ్వరికి డ్రగ్స్ తీసుకోవాలంటే ఆలోచన కూడా రాకూడదని అంత కఠినంగా వారిని శిక్షించాలని పోలీసులు న్యాయవ్యవస్థ కు విజ్ఞప్తి చేశారు. ప్రజాప్రతినిధులు బాధ్యతయుతంగా ఉండాలని అందుకే అసెంబ్లీకి వచ్చే ఎమ్మెల్యేలు అందరికీ డ్రగ్స్ పరీక్షలు చేయించాలని సీఎం రేవంత్ రెడ్డిని కోరుతానని అనిరుద్ రెడ్డి వెల్లడించారు. అందరికంటే ముందుగా తాను రక్త పరీక్ష చేయించుకుంటారని ప్రకటించారు. తన వద్ద కూడా గన్ లైసెన్స్ గన్ ఉన్నాయని అయితే వాటిని తాను ఎప్పుడు వాడింది లేదని తెలిపారు.

## బోధన్ లోఎక్కడ చూసినా గంజాయి దొరకటం వల్ల యువత చెడు వ్యసనాలకు గురవుతుందని బోధన్ మాజీ ఎమ్మెల్యే షకీల్ అమీర్ సంచలవ్యాఖ్యలు చేశారు



బోధన్ పట్టణం మార్చి 15 వార్త నిర్భయం :మాజీ ఎమ్మెల్యే షకీల్ అమీర్ బోధన్ పట్టణంలో పెరుగుతున్న గంజాయి విక్రయాలపై తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తూ, దీనిని అరికట్టాలని డిమాండ్ చేశారు. మహారాష్ట్ర సరిహద్దుల నుండి వస్తున్న ఈ గంజాయి మహమ్మారి ప్రస్తుతం పాన్ షాపుల్లో కూడా సులభంగా దొరికే స్థాయికి చేరిందని, ఇది చదువుకోవాల్సిన విద్యార్థుల భవిష్యత్తును నాశనం చేస్తోందని ఆయన ఆందోళన చెందారు. పోలీసులు వెంటనే రంగంలోకి దిగి ప్రత్యేక టాస్క్ ఫోర్స్ బృందాలను ఏర్పాటు చేయాలని, గంజాయి స్థావరాలపై ఉక్కుపాదం మోపి ఈ విక్రయాలకు అడ్డుకట్ట వేయాలని ఆయన మీడియా వేదికగా విజ్ఞప్తి చేశారు.

## ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర మంత్రి వాకిటి శ్రీహరి ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి



జడ్చర్ల మార్చి 15 వార్త నిర్భయం

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఆదివారం జడ్చర్ల మున్సిపాలిటీలోని ప్రభుత్వ ఆసుపత్రిలో నిర్వహించిన పారిశుద్ధ్య కార్యక్రమంలో రాష్ట్ర క్రీడా శాఖ మంత్రివర్యులు వాకిటి శ్రీహరి, జడ్చర్ల శాసనసభ్యులు జనంపల్లి అనిరుద్ రెడ్డి ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆసుపత్రి పరిసరాల్లో చేపట్టిన పారిశుద్ధ్య కార్యక్రమాన్ని ప్రారంభించి స్వయంగా పరిశుభ్రత కార్యక్రమాలను పరిశీలించారు. ఆసుపత్రి ప్రాంగణాన్ని పరిశుభ్రంగా ఉంచి రోగులకు ఆరోగ్యకరమైన వాతావరణం కల్పించాలన్నారు. రోగులు మరియు వారి కుటుంబ సభ్యులు ఇబ్బందులు పడకుండా మెరుగైన సౌకర్యాలు అందించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. జడ్చర్ల నియోజకవర్గంలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేలా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందన్నారు. ఆసుపత్రిలో పారిశుద్ధ్యాన్ని కచ్చితంగా పాటిస్తూ రోగులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సేవలు అందించాలని అధికారులను సూచించారు. నియోజకవర్గ అభివృద్ధి మరియు ప్రజల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తున్నామని తెలిపారు.

## ఆధారాలు బయటపెడితే నన్ను బదనాం చేస్తారా..

### రేవంత్‌రెడ్డి ప్రభుత్వంపై కవిత ధ్వజం.




హైదరాబాద్ మార్చి 15 (వార్త నిర్భయం)

సీఎం రేవంత్‌రెడ్డి హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్‌పై తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రపంచ బ్యాంక్‌కు మూసీ పరివాహక ప్రాంత భూములను కట్టబెట్టే ప్రయత్నం చేస్తున్నారని ధ్వజమెత్తారు.ఆదివారం హైదరాబాద్‌లోని తెలంగాణ జాగృతి కార్యాలయంలో కవిత మీడియాతో మాట్లాడారు. ఇప్పటివరకు మూసీపై కాంగ్రెస్ ప్రభుత్వం డీపీఆర్‌ను ఎందుకు విడుదల చేయట్లేదని ప్రశ్నించారు.ఫేజ్- వన్‌కి సంబంధించిన డీపీఆర్‌ను కాంగ్రెస్ ప్రభుత్వం చూపెట్టిందని ప్రస్తావించారు. పూర్తి డీపీఆర్ ఇవ్వకపోవడం వెనుక మోసం ఉందని ఆరోపించారు. ప్రీ ఫీజబులిటీ రిపోర్టులో రూ.5,641 కోట్లు ఖర్చు అవుతుందని ఈ ప్రభుత్వం చెప్పిందని గుర్తుచేశారు.

### మూసీపై ప్రజెంటేషన్‌కు ఎందుకు పిలవలేదు..

ఆరు నెలల తర్వాత దాదాపు రూ.1400 కోట్ల అంచనా ఎందుకు పెరిగిందని కవిత నిలదీశారు. జాతిపిత మహాత్మాగాంధీ విగ్రహానికి ఎంత ఖర్చు అవుతుందో.. ఆ ఖర్చు మొత్తం సీఎం రేవంత్‌రెడ్డి ఇంటి నుంచి ఇవ్వాలని డిమాండ్ చేశారు. మూసీ ప్రాజెక్టు ప్రజెంటేషన్‌కు రియల్ ఎస్టేట్ వ్యాపారులు, ప్రపంచ బ్యాంక్ ప్రతినిధులు, మంత్రులను పిలిచారని అన్నారు. కానీ మూసీలో ఇళ్లు కోల్పోయిన నిర్వాసితులను ప్రజెంటేషన్‌కు ఎందుకు పిలవలేదని ప్రశ్నల వర్షం కురిపించారు. తెలంగాణలో చిన్న మోదీలా.. రేవంత్‌రెడ్డి వ్యవహారం ఉందని ఎద్దేవా చేశారు. మూసీ పేరుతో సీఎం గ్రాఫిక్స్ చూపెట్టారని సెటైర్లు గుప్పించారు. 16 నాలాల నుంచి మూసీలోకి మురుగు నీరు వస్తోందని చెప్పుకొచ్చారు. నగరంలో ఉన్న వ్యర్థాలన్నీ మూసీలోకి వెళ్తున్నాయని తెలిపారు.

### అరాచకం చేస్తున్నారు..

హైడ్రాతో కలిసి సీఎం రేవంత్‌రెడ్డి అరాచకం చేస్తున్నారని కవిత ఆగ్రహించారు. హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు ఇప్పటివరకు ఆరు ఫిర్యాదులు చేశామని ప్రస్తావించారు. హైడ్రా కమిషనర్, ప్రభుత్వంపై పరువు నష్టం దావా వేస్తానని అన్నారు. నాలాలు ఆక్రమించి విల్లాలు కడుతున్న సంస్థ తమ పరిధిలోకి రాదని హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఎలా చెబుతున్నారని ఫైర్ అయ్యారు. సిగ్గు లేకుండా రంగనాథ్ హైడ్రా వీడియోలు తీసి పెడుతున్నారని ఎద్దేవా చేశారు. ఇష్టం వచ్చినట్లుగా వీడియోలు పెడుతున్నారని.. మీరేమైనా కంటెంట్ రైటర్లా ...? అని ధ్వజమెత్తారు.

### కాంగ్రెస్ ప్రభుత్వం బాయిలో దూకాలి..

తాను ఆధారాలు బయటపెడితే హైడ్రా, కాంగ్రెస్ ప్రభుత్వం బాయిలో దూకాలని కవిత ఎద్దేవా చేశారు. తాను ఆధారాలు బయటపెడితే ఈ ప్రభుత్వం, ప్రతిపక్షం కలిసి తనను బదనాం చేస్తారా...?, తమాషాలు చేస్తున్నారా..? అని ఆగ్రహించారు. హైడ్రా పెట్టిన ట్వీట్స్ వెంటనే డిలీట్ చేయాలని.. లేకపోతే పరువు నష్టం దావా వేస్తానని హెచ్చరించారు. తెలంగాణలో రియల్ ఎస్టేట్ ప్రభుత్వం నడుస్తోందని ఆరోపించారు. ఖమ్మం జిల్లాలోని వెలుగుమట్లలో అసలైన బాధితులకు ఇళ్ల పట్టాలను రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నల వర్షం కురిపించారు. అందులో కొంతమంది కాంగ్రెస్ కార్యకర్తలకు ఇచ్చారనే విషయం తమ దృష్టికి వచ్చిందని అన్నారు. త్వరలో వెలుగుమట్లలో పర్యటిస్తానని కవిత స్పష్టం చేశారు.

# శిలలను సైతం కరిగించగల శక్తి సంగీతానిధి

**అలాంటి సంగీతాన్ని ప్రోత్సహించడంలో అభిమానులకు అందిం చడంలో సుధాబ్యాంక్ ముందుంటుంది**

**త్యాగ శ్యామ దీక్షిత ఆరాధనలో సుధా బ్యాంక్ చైర్మన్ మీలా మహదేవ్**

**బ్యాంకు మేనేజింగ్ డైరెక్టర్ పెద్దిరెడ్డి గణేష్**



సూర్యాపేట బ్యూరో మార్చి 15 వార్త నిర్భయం

శిలలను సైతం కరిగించగల శక్తి సంగీతానికి ఉందని అలాంటి సంగీతాన్ని ప్రోత్సహించడంలో సంగీత ప్రియులకు అందించడంలో సుధా బ్యాంక్ ఎల్లప్పుడు ముందుంటుందని సుధా కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ చైర్మన్ మీలా మహదేవ్ అన్నారు. ఆదివారం రాత్రి స్థానిక సుధా బ్యాంకు ఆడిటోరియంలో కర్ణాటక సంగీత త్రాయం ఆరాధన ఉత్సవాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. బ్యాంకు మేనేజింగ్ డైరెక్టర్ పెద్దిరెడ్డి గణేష్ మాట్లాడుతూ ప్రముఖ గాయకులు ఎన్నో జాతీయ అంతర్జాతీయ వేదికలపై తన గానాన్ని వినిపించిన ప్రపంచ ప్రఖ్యాత గాయకులు మోదుమూరి సుధాకర్ త్యాగ శ్యామ దీక్షిత ఆరాధన ఉత్సవంలో గానం చేయడం మనందరి అదృష్టం అన్నారు. సుధా బ్యాంకు సంగీతాన్ని సాహితి ప్రియులను గుర్తించి గౌరవించడంలో వారి ప్రతిభను వెలికి తీయడంలో ఎప్పుడు ముందుంటుందన్నారు. సుధా బ్యాంక్ వార్షికోత్సవ సందర్భంగా ప్రతి సంవత్సరం త్యాగరాజ ఆరాధన ఉత్సవాలను ఆనవాయితీగా నిర్వహిస్తు శాస్త్రీయ సంగీత గొప్పతనాన్ని గుర్తు చేస్తుందన్నారు. కర్ణాటక సంగీత త్రయం ఆరాధనోత్సవం లో భాగంగా త్యాగ శ్యామ దీక్షిత ఆరాధన ఉత్సవాన్ని ప్రముఖ సంగీత విద్వాంసులు ఎన్సీఆర్ సంగీత పరిషత్ ఎన్.సి.ఆర్.రంగాచార్యులు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ ఆరాధన ఉత్సవాన్ని సూర్యాపేట సంగీత ప్రియులు అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయడం అభినందనీయమన్నారు. అనంతరం ప్రముఖ సంగీత విధ్వంసులు ఎన్సీ రంగాచార్యులు, గాయకులు మోదుమూరి సుధాకర్, ఎన్ . వయోలిన్ న్ సి.మాధవ, మృదంగం అరవింద్ లను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జె.శశిధర్, డీఎస్వి శర్మ, కక్కిరేణి చంద్ర శేఖర్, తోట శ్యాం ప్రసాద్ బోనగిరి భాస్కర్ ,ఏపూరి శ్రవణ్ కుమార్, శర్మ ,కొత్త మల్లికార్జున్ మేనేజర్లు రవీందర్ రెడ్డి,సైదులు, అంజన్ ప్రసాద్,వెంకటేశ్వర్లు, మధు,అంజన,గుండా ఉపేందర్,విద్యాసాగర్ ,కృష్ణ,పాటు పెద్ద ఎత్తున సంగీత ప్రియులు, అభిమానులు, పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.

# పారిశుధ్య కార్మికుల ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యం...చైర్‌పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాది,

**ప్రజా పాలనప్రగతి ప్రణాళికలో భాగంగా మున్సిపల్ కార్యాలయంలో ఉచిత వైద్య పరీక్షల శిబిరం.**



సూర్యాపేట బ్యూరో మార్చి 15 (వార్త నిర్భయం)

పట్టణ పరిశుభ్రతలో కీలక పాత్ర పోషిస్తున్న పారిశుధ్య కార్మికుల ఆరోగ్య పరిరక్షణకు మున్సిపాలిటీ ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తుందని మున్సిపల్ చైర్‌పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాది తెలిపారు.ప్రజా పాలనప్రగతి ప్రణాళికలో భాగంగా ఆదివారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో పారిశుధ్య కార్మికుల కోసం నిర్వహించిన ఉచిత వైద్య పరీక్షల శిబిరాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. ఈ సందర్భంగా కార్మికులకు సాధారణ ఆరోగ్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వైద్య సూచనలు అందించారు.అనంతరం చైర్‌పర్సన్ మాట్లాడుతూ పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు పారిశుధ్య కార్మికులు ప్రతిరోజూ కష్టపడి పనిచేస్తున్నారని అన్నారు. ప్రజల ఆరోగ్య రక్షణలో వారి సేవలు ఎంతో విలువైనవని పేర్కొన్నారు. అందువల్ల వారి ఆరోగ్యం కాపాడటం కూడా మున్సిపాలిటీ బాధ్యతగా భావిస్తున్నామని తెలిపారు.పారిశుధ్య కార్మికులు రోజువారీ పనుల్లో భద్రతా నియమాలను పాటిస్తూ ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టాలని సూచించారు. అవసరమైనప్పుడు వెంటనే వైద్య పరీక్షలు చేయించుకోవాలని, ప్రభుత్వ ఆసుపత్రుల్లో అందుబాటులో ఉన్న వైద్య సేవలను వినియోగించుకోవాలని తెలిపారు. పారిశుధ్య కార్మికులు ప్రతిరోజూ ప్రజల ఆరోగ్యం కోసం శ్రమిస్తున్నారని పేర్కొన్నారు. వారి ఆరోగ్య రక్షణ కోసం ఇటువంటి వైద్య శిబిరాలను నిర్వహించడం అవసరమన్నారు. భవిష్యత్తులో కూడా కార్మికుల సంక్షేమం కోసం మున్సిపాలిటీ తరఫున మరిన్ని కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. ఇలాంటి వైద్య శిబిరాలను తరచూ నిర్వహిస్తూ పారిశుధ్య కార్మికుల ఆరోగ్య పరిస్థితిని పరిశీలిస్తామని, వారి సంక్షేమానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు.ఈ కార్యక్రమం లో మున్సిపల్ కమీషనర్ సిఎచ్. హన్మంతరెడ్డి,వైస్ ఛైర్మెన్ యం. డి. షఫీ ఉల్లా, 40 వ వార్డు కౌన్సిలర్ కొణతం రాజేష్ రెడ్డి, శానిటేరి ఇన్స్పెక్టర్ సారగండ్ల శ్రీనివాస్, ఎన్విరాన్ మెంట్ ఇంజనీర్ శివ ప్రసాద్ వైద్య అధికారులు,సిబ్బంది, పారిశుధ్య కార్మికులు, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# గ్రామీణ వైద్యుల సేవలను ప్రభుత్వం గుర్తించాలి

**గ్రామీణ వైద్యులకు శిక్షణను అందించి సర్టిఫికెట్లు అందజేయాలి**

**ఆర్ఎంపీ, పీఎంపీ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు పి.వెంకన్న**




సూర్యాపేట బ్యూరో మార్చి 15 వార్త నిర్భయం

సూర్యాపేట: గ్రామీణ వైద్యుల సేవలను ప్రభుత్వం గుర్తించి వారికి శిక్షణను అందించి సర్టిఫికెట్లను అందజేయాలని తెలంగాణ రాష్ట్ర ఆర్ఎంపీ, పీఎంపీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు పి.వెంకన్న అన్నారు.ఆదివారం జిల్లా కేంద్రంలోని లక్ష్మీ గార్డెన్స్ లో తెలంగాణ ఆర్ఎంపి అండ్ పిఎంపి వెల్ఫేర్ అసోసియేషన్ సూర్యాపేట జిల్లా 13వ మహాసభను ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూఆర్ఎంపి, పిఎంపిలను తిరిగి కమ్యూనిటీ పారామెడిక్ గా గుర్తించి శిక్షణ ఇవ్వడానికి నిర్ణయం తీసుకున్న సీఎం రేవంత్ రెడ్డికి, రాష్ట్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు.ఈ మహాసభ ద్వారా ఆడపిల్లలను రక్షిద్దాం ఆడపిల్లలను చదివిద్దాం అనే నినాదం ద్వారా ప్రజలను చైతన్యవంతులను చేయాలని కోరారు.గ్రామ, మండల, డివిజన్ స్థాయి కమిటీలను ఏర్పాటు చేసుకొని సంఘాన్ని బలోపేతం చేయాలని అన్నారు.అర్హత గల గ్రామీణ వైద్యులకు పారామెడికల్ శిక్షణను అందించేందుకు సంఘం తరఫున కృషి చేస్తామని తెలిపారు.గ్రామీణ వైద్యులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంతోపాటు వారి సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.అంతకుముందు ఈ మహాసభకు ముఖ్య అతిథులుగా హాజరైన ప్రజా విప్లవ గాయని విమలక్క, తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి అన్నెపర్తి జ్ఞాన సుందర్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల ప్రజలకు అందుబాటులో ఉంటూ వైద్య సేవలు అందిస్తూనే ఆర్ఎంపి, పిఎంపీల సేవలు అభినందనీయం అన్నారు.ఈ కార్యక్రమంలో సంఘ రాష్ట్ర కోశాధికారి ఎండి గఫార్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పి.సత్యనారాయణ, రాష్ట్ర గౌరవ అధ్యక్షులు బి.వెంకటేశ్వర్లు, ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శి వీరాచారి, నీలాద్రి గ్రూప్ ఆఫ్ చైర్మన్ పీసాటి జితేందర్ రెడ్డి, ప్రముఖ వ్యాపారవేత్త గుర్రం సత్యనారాయణ రెడ్డి, స్పర్శ అధ్యయన కేంద్రం కాకి భాస్కర్ రెడ్డి, అపెక్స్ గ్రూప్ ఆఫ్ చైర్మన్ కుంభం భాస్కర్ రెడ్డి, అడ్వకేట్ జూపల్లి సాయికృష్ణ,కె.శ్రీనివాస్ రెడ్డి,సూర్యాపేట జిల్లా అధ్యక్షులు పుప్పల లక్ష్మీనరసయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి పోలిశెట్టి రాజేందర్, జిల్లా సహాధ్యక్షులు షేక్ రహమతుల్లా, కోశాధికారి జెర్రీపోతుల లక్ష్మణ్, వర్కింగ్ ప్రెసిడెంట్ బెల్లంకొండ డాంగే, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రెటరీ గూకంటి రాజబాబు రెడ్డి, పప్పుల వెంకన్న, సరికొండ నాగరాజు, చింతకింది సోమనారాయణ,సాయి మారుతి హాస్పిటల్‌డైరెక్టర్ షేక్‌రఫీ,ఆర్ఎంపీలు, పీఎంపీలు పాల్గొన్నారు.

# 2 కోట్ల రూపాయలతో మినీ ఫంక్షన్ హాల్

**పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి**



సంగారెడ్డి జిల్లా మార్చ్ 15 (వార్తా నిర్ణయం )

పటాన్చెరు డివిజన్ పరిధిలోని ప్రజల సౌకర్యార్థం మినీ ఫంక్షన్ హాళ్లు నిర్మిస్తున్నామని పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. పటాన్చెరు డివిజన్ పరిధిలోని చైతన్య నగర్ కాలనీలో రెండు కోట్ల రూపాయల అంచనా వ్యయంతో చేపట్టనున్న మినీ ఫంక్షన్ హాల్ నిర్మాణ పనులకు ఆదివారం ఉదయం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద, మధ్య తరగతి ప్రజలకు అతి తక్కువ ధరలో ఫంక్షన్ హాళ్లు అందించాలన్న లక్ష్యంతో మినీ ఫంక్షన్ హాళ్లు నిర్మిస్తున్నామని తెలిపారు. ప్రజల అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, పట్టణ పుర ప్రముఖులు, సీనియర్ నాయకులు, అంబేద్కర్ సంఘం ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.